


# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, గురువారం 17-02-2022 | VIJAYABHANU DAILY ⁎ VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 127 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## విధానాలను అధ్యయనం చేయండి

### ఆర్థిక వనరులు సమకూర్చే శాఖలతో సీఎం సమీక్ష



తాడేపల్లి (విజయభాను న్యూస్) : రాష్ట్రానికి ఆర్థిక వనరులు సమకూర్చే శాఖలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం సమీక్ష చేపట్టారు. అదనపు ఆదాయాలకోసం వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం ఆదేశించారు.


ఎస్ఓఆర్(రాష్ట్రాల సొంత ఆదాయం)ను పెంచుకోవడానికి ఆయా రాష్ట్రాల్లో ఎలాంటి పద్ధతులు, విధానాలు పాటిస్తున్నారో పరిశీలించాలన్నారు. తద్వారా రాష్ట్ర సొంత ఆదాయాలు పెరగడానికి తగిన ఆలోచనలు చేయాలని.. వీటిని కార్యరూపంలోకి తీసుకురావడానికి దృష్టిపెట్టాలని సీఎం పేర్కొన్నారు. ఈ అంశాలపై ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించుకోవడానికి సంబంధిత శాఖలకు చెందిన అధికారులు క్రమం తప్పకుండా సమావేశం కావాలని సీఎం పేర్కొన్నారు.

"ప్రభుత్వానికి ఆదాయాన్ని తీసుకురావడంలో కలెక్టర్లు క్రియాశీలకంగా వ్యవహరించాలి. పారదర్శక విధానాలను పాటిస్తూ ముందుకు సాగాలి. రాబడులను పెంచుకునే క్రమంలో అధికారులు తమ విచక్షణాధికారాలను వాడేటప్పుడు కచ్చితమైన ఎస్ఓపీలను పాటించాలి. పెండింగ్‌లో ఉన్న వ్యాట్ కేసులను పరిష్కరించడం ద్వారా బకాయిలను రాబట్టుకోవడంపై దృష్టి సారించాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వీలైనంత త్వరగా వేగవంతం చేయాలి. 51 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇప్పటికే అందుతున్న రిజిస్ట్రేషన్ సేవలను సమీక్షించి... తగిన మార్పులు, చేర్పులు చేయాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వెలుగుచూసిన అవినీతి ఘటనలు, లోపాలు తిరిగి గ్రామ, వార్డు సచివాలయాల్లో

[తరువాయి 2లో..

### ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు

## బప్పీ లహరి ఇకలేరు



న్యూఢిల్లీ : ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు బప్పీ లహరి ఇకలేరు. తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆయన బుధవారం ఉదయం ముంబై లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కన్నుమూశారు. ప్రముఖ గాయని లతామంగేష్కర్ ఇకలేరన్న వార్తను ఇంకా జీర్ణించుకోలోని సినీ సంగీత అభిమానులు బప్పీదా అస్తమయంతో విషాదంలో మునిగిపోయారు. డిస్కో కింగ్ ఆఫ్ బాలీవుడ్, గోల్డ్‌మ్యాన్ బప్పీ దా మరణం తీరని లోటంటూ పలువురు సంతాపం ప్రకటించారు. బప్పీ లహరి అనగానే ప్రసిద్ధ డిస్కో-ఎలక్ట్రానిక్ సంగీతం, ఒంటినిండా బంగారు ఆభరణాలు, గొలుసులు, కంకణాలు, వెల్వెట్ కార్డిగాన్స్, సన్ గ్లాసెస్‌తో ఒక స్పెషల్ స్టైల్ గుర్తు వస్తుంది. 1952 నవంబరు 27న కోలకతాలో పుట్టారు బప్పీ లహరి, ఆయన అసలు పేరు అలోకేష్ లహరి. 3 సంవత్సరాల వయస్సులో తబలా వాయించడం ప్రారంభించి అటు బాలీవుడ్‌ను, ఇటు సౌత్‌లో ముఖ్యంగా తెలుగు తమిళం,కన్నడ పరిశ్రమలో లెజెండ్రీ మ్యూజిక్ డైరెక్టర్‌గా, సింగర్‌గా అభిమానుల గుండెల్లో గూడు కట్టుకున్నారు. తన తుది శ్వాసవరకూ మ్యూజిక్ ప్రాణంగా బతికిన లెజెండ్ ఆయన. డిస్కో, ఎనర్జిటిక్ సాంగ్స్‌కు పెట్టింది పేరు బప్పీ లహరి. డిస్కో డాన్సర్, నమక్ హలాల్, హిమ్మత్ వాలా,

[తరువాయి 2లో..

## సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



అమరావతి : నూతన డీజీపీగా నియమితులైన కసిరెడ్డి వెంకట రాజేంద్రనాథ్ రెడ్డి సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీగా ఉన్న రాజేంద్రనాథ్ రెడ్డికి ఏపీ ప్రభుత్వం డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో సీఎంతో ఆయన సమావేశమయ్యారు.

1992 బ్యాచ్‌కు చెందిన రాజేంద్రనా థ్‌రెడ్డి.. 1994లో ఉమ్మడి ఏపీలో నిజామాబాద్ జిల్లా బోధన్ అదనపు ఎస్పీగా పోస్టింగ్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లాలో పలు బాధ్యతలు నిర్వర్తించిన అనంతరం ఆయన విశాఖపట్నం, నెల్లూరు జిల్లాలతో పాటు సీఐడీ, రైల్వే ఎస్పీగా పనిచేశారు.

విజయవాడ, విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. హైదరాబాద్ వెస్ట్ జోన్, మెరైన్ పోలీస్ విభాగంలో ఉత్తర కోస్తా ఐజీగా పనిచేశారు. పలు కీలక కేసులను ఛేదించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.

## ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందేది భారత ఆర్థిక వ్యవస్థే

### కేంద్ర ఆర్థికశాఖ నెలవారీ నివేదిక




దిల్లీ: బడ్జెట్ 2022-23లో తీసుకున్న అనేక నిర్ణయాల వల్ల భారత వృద్ధి రేటు ఇతర పెద్ద దేశాలతో పోలిస్తే వేగంగా పుంజుకుంటుందని కేంద్రం తెలిపింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు అందుకున్న తయారీ, నిర్మాణ రంగాలు అందుకు దోహదం చేస్తాయని పేర్కొంది. నెలవారీ ఆర్థిక సమీక్ష నివేదికలో ఈ విషయాలను వెల్లడించింది.

వ్యవసాయ రంగానికి వస్తే సాగు విస్తీర్ణంలో పెరుగుదల స్థిరంగా కొనసాగుతోందని తెలిపింది. బహుళ పంటల సాగు సైతం పుంజుకుందని పేర్కొంది. అలాగే భారీ ఎత్తున కొనుగోలు, పీఎం కిసాన్ సహా కనీస మద్దతు ధర వంటి ప్రభుత్వ చర్యల వల్ల రైతులు సైతం లాభపడనున్నారని నివేదిక అభిప్రాయపడింది. 2022కి గానూ ఒక్క భారత్ తప్ప ప్రపంచ దేశాల వృద్ధిరేటు

[తరువాయి 2లో..

## దుబాయ్ ఎక్స్‌పోలో ఆకట్టుకున్న ఏపీ

- రూ 3000 కోట్ల పెట్టుబడితో అంతర్జాతీయ సంస్థలు ఒప్పందం
- రహదారులకోసం ఒక్క ఏడాదిలోనే రూ.2205 కోట్లు కేటాయించిన సర్కార్
- ఆరోగ్యశాఖలో 2588 పోస్టుల భర్తీ
- కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యసేవలు
- ఈ-కామర్స్ వేదికపై ఏపి వీవర్స్ సొసైటీ రికార్డ్ స్థాయి అమ్మకాలు
- 1.5 లక్షల మంది లబ్దిదారులకు జగన్న తోడు
- అంబేద్కర్ స్మృతివనం, రాజ్యంగ నిర్మాతపై సిఎం జగన్ భక్తిభావానికి ప్రతీక
- ట్విట్టర్ వేదికగా ఎంపీ(రాజ్యసభ) విజయసాయి రెడ్డి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : దుబాయ్ ఎక్స్పోలో ఏపీ ప్రభుత్వం మూడు ఎంఓయూలు కుదుర్చుకుందిని రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ట్విట్టర్ వేదికగా పలు అంశాలు వెల్లడించారు. లండన్ కు చెందిన కాజస్ సంస్థతో రూ.3వేల కోట్ల ఒప్పందం జరిగిందని అన్నారు. రూ.150 కోట్ల విలువైన 25 రిటైల్ ఔట్ లెట్లు ఏర్పాటుకు రీజెన్సీ గ్రూప్ ముందుకొచ్చిందని పేర్కొన్నారు. విశాఖలో 300 హైఎండ్ ఐటీ ఉద్యోగాలిచ్చే కంపెనీతో మరో ఒప్పందం కుదిరిందని అన్నారు. రాష్ట్రంలో రహదారుల నిర్వహణ, మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రూ.2,205 కోట్లు ఇచ్చిందని. రాష్ట్ర చరిత్రలో ఒక్క ఏడాదిలో ఏ

[తరువాయి 2లో..

## తిరుమలలో వైభవంగా శ్రీవారి పౌర్ణమి గరుడసేవ

తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో బుధవారం రాత్రి పౌర్ణమి గరుడ సేవ వైభవంగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి తిరుమల మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్య దేశాల్లోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడ వాహనసేవ ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడనని తెలియజేస్తాడని ప్రతీతి. జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడిని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటి నమ్మకం. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో రమేష్‌బాబు, పేష్కార్ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.




## నగరాభివృద్ధికి చేయూతనివ్వండి

### ఆర్.డబ్ల్యూ.ఎ. ల ప్రతినిధులతో జివిఎంసి కమిషనర్



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : నగరాభివృద్ధికి చేయూతనివ్వాలని ఆర్.డబ్ల్యూ.ఎ.ల ప్రతినిధులను జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మిశ కోరారు. బుధవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో నగర పరిధిలో ఉన్న రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులతో స్వచ్ఛ సర్వేక్షణ్-2022పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ లో గత మీ అనుభవాలను, సూచనలను, సలహాలను జివిఎంసి కి అందించి, నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలని, స్వచ్ఛ సర్వేక్షణ్-2022లో మెరుగైన

[తరువాయి 2లో..

## మధురవాడలో స్వచ్ఛ సర్వేక్షణ్ పై అవగాహన



మధురవాడ (విజయభాను న్యూస్) : స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా మహా విశాఖ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ జి.లక్ష్మిశ బుధవారం జోన్-2 పరిధి లోని 5,7,వార్డులలో పర్యటించి ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్ పై అవగాహన కల్పించారు. 5,7,వార్డుల కార్పొరేటర్లు మొల్లిహేమలత, పిళ్ళ మంగమ్మవెంకటరావు, వైయస్సార్సీపి 7వవార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు లతో కలసి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కాలువలు, డ్రైన్లు, వాంబే కాలనీ లోని యూజీడీ నిర్వహణ, పార్కులు, 5వవార్డు లోని కొండవాలు ప్రాంతాల నీటి సమస్యలు, స్మశాన వాటికలు తదితర సమస్యలను పరిశీలించారు. అనంతరం ప్రజా సంఘాలు ప్రజా ప్రతినిధులతో కలిసి స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీలో పాల్గొని, ప్రజలకు అవగాహన కల్పించాలని, కార్యదర్శులందరూ స్వచ్ఛ సర్వేక్షణ్ పైఅవగాహన కలిగి ఉండాలని, యూజర్ చార్జీల వసూలను వేగవంతం చేయాలని సూచించారు.5,7 వార్డులలోని స్మశాన వాటికలలో మౌళిక వసతులైన షెడ్లు,విద్యుత్,త్రాగునీరు ఏర్పాటు చేసి అభివృద్ధి పరచాలని కార్పొరేటర్లు కమిషనర్ ను కోరారు. ఈ సందర్భంగా 5వ వార్డ్ సమస్యలు,అభివృద్ధి కార్యక్రమాలపై కార్పొరేటర్ మొల్లి హేమలత కమిషనర్ కు వినతిపత్రాన్ని అందించారు. ముఖ్యంగా డంపింగ్ యార్డ్ వలన సమస్యలు, కొండవాలు ప్రాంతాలైన సాయిరామకాలనీ, సర్వేనెంబర్ 27లో అయ్యప్పనగర్, వివేకా నందనగర్, ముత్యాలమ్మకాలనీ, గాంధీనగర్, సద్గురు సాయినాథ్ కాలనీ, శివశక్తినగర్, మరియు శారదనగర్ ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు అవసరమని,విద్యుత్ స్తంభాలు లేక ఆప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, త్వరితగతిన విద్యుత్ స్తంభాలు,లైట్లు ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్ జి శాస్త్రి,జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, కార్యనిర్వాహక ఇంజినీరు వంశి, ఎసిపిభాస్కర్, ఎఎంఒహెచ్ కిషోర్, ఉపకార్యనిర్వాహక ఇంజినీరు, ఇంజినీరు, శానిటరీ సూపర్వైజర్,శానిటరీ ఇన్స్పెక్టర్,వార్డు-సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### సైన్స్ వారోత్సవాల సందర్భంగా

## గీతం పోటీలు

సాగర్‌నగర్ : ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న జాతీయ సైన్స్ వారోత్సవాలు సందర్భంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో నగరంలోని పాఠశాల మరియు కళాశాలల విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎమ్.శరత్ చంద్రబాబు తెలిపారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు కళాశాల విద్యార్థులకు క్విజ్ మరియు వకృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. 23 నుంచి 26వ తేదీ వరకు పాఠశలలకు చెందిన వివిధ తరగతుల విద్యార్థులకు క్విజ్ మరియు వకృత్వ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 22 వ తేదీన అన్ని తరగతుల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వివరాలకు గీతం వెబ్‌సైట్‌ను www.gitam.edu సంప్రదించాలని సూచించారు.

**ప్రముఖుల ప్రసంగాలు:**

జాతీయ సైన్స్ వారోత్సవాలు సందర్భంగా ఈ నెల 22వ తేదీన శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ రోహిత్ శ్రీవాత్సవ ప్రసంగాన్ని, 23వ తేదీన సిఎస్అయ్యార్ పర్యావరణ విభాగం ఛీప్ సైంటిస్ట్ డాక్టర్ సాధన రాయలు, ప్రసంగాలు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.


## కిడ్నీ బాధితునికి ఆర్థిసహాయం



గాజువాక :(విజయభాను న్యూస్ ): బి హెచ్ పి వి క్లబ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో గాజువాక జయప్రకాశ్ అనే యువకుడికి రెండు కిడ్నీలు చెడిపోయి నందువలన బిసిఎఫ్ కమిటీ స్పందించి మానవతా సహృదయంతో ఒక లక్ష రూపాయలు బుధవారం తల్లి కుమారికు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. జై ప్రకాష్ త్వరగా కోలుకోవాలని బిసిఎఫ్ కమిటీ దేవుని ప్రార్థిస్తుంది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాము, నారాయణ రెడ్డి, నాని బాబు, సిరట్ల శ్రీనివాస్ (వాసు),దివాకర్, బాలు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లం వినాయకుని ఆలయం అందరిదీ

- దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని అర్చకత్వం మాది
- మా ప్రాంతంలో ఉందని స్వాధీనం చేసుకుంటామంటే చట్ట ఉల్లంఘనే
- దైవం వద్ద భక్తులుగ ఉండాలి తప్పా సొంతం చేసుకునే ఆలోచన తప్పే
- 11వ శాతాబ్ధపు బెల్లం వినాయక ఆలయ అర్చకులు శర్మ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : కుళుత్తుంగ చోళరాజుల కాలంలో వెలసిన చారిత్రాత్మక ఆలయం బెల్లం వినాయకుడు ( ఆనంద గణపతి) ఆలయం దేవాదాయ ధర్మాదాయ శాఖ నియమ నిబంధనల ప్రకారం నడిచే ఆలయమనీ భక్తులందరి ఆరాధ్య దైవమనీ ఆలయ అర్చకులు శర్మ పేర్కొన్నారు. అత్యధిక సంఖ్యలో భక్తులు కొలిచే ఈ బుచ్చి రామలింగేశ్వర స్వామి- బెల్లం వినాయకుని ఆలయం అందరిదీనని ఆయన తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని అర్చకత్వం మాదనీ.,

మా ప్రాంతంలో ఉందనీ స్వాధీనం చేసుకుంటామంటే చట్ట ఉల్లంఘనే అవుతుందనీ ఆయన భావించారు. దైవం వద్ద భక్తులుగ ఉండాలి తప్పా సొంతం చేసుకునే ఆలోచన మాత్రం కూడదని ఈ11వ శతాబ్ధపు బెల్లం వినాయక ( ఆనంద గణపతి) ఆలయ అర్చకులు శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబాల సమీపంలో బీచ్ రోడ్డుని ఆనుకుని ఉన్నందున బెల్లం వినాయకుని ఆలయంను స్వాధీనం చేసుకుని స్వయంగా నడుపుకుంటామనడం సరికాదన్నారు. ఈ ఆలోచనతో ఒలిశెట్టి తాతాజీ., చింతపల్లి అయ్యప్ప., సురకుల శ్రీను తదితరులు మీదకు దండుగ తన వారతో వచ్చి అలజడి సృష్టించడం బాధాకరం అన్నారు. బుధవారం ఆలయ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద అలజడి సృష్టించడానికి ముందు

అంటే., ఈ నెల ఫిబ్రవరి 5వ తేదీ నుంచి వేధింపులకు గురిచేయడం ఈ ముగ్గురూ ప్రారంభించారని మీడియాకు చెప్పారు. దశాబ్దాలుగా శ్రీ బెల్లం వినాయకుని సేవిస్తూ వర్ణ వర్గ తారతమ్యం లేకుండా ఈ ఆనంద గణపతి ద్వారా భక్తుల ఆకాంక్షలు ఆశించి పూజాదికాలు నిర్వహిస్తూ దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధి నియమనిబంధనలు పాటిస్తూ నిర్వహిస్తున్నామన్నారు. స్వామి వారిని కొలిచీ స్వాంతన పొందుతున్న వారిలో ఆలయ ప్రజానీకమూ ఉన్నారని అన్నారు. కానీ ఒలిశెట్టి తాతాజీ, చింతపల్లి అయ్యప్ప, సురకుల శ్రీనులు బీచ్ రోడ్డులో ఉన్న తమ మత్స్యకార కుటుంబాల తరపున అమ్మవారిని ప్రతిష్ఠించుకున్నామనీ., ఆంజనేయ స్వామినీ ఏర్పాటు చేసుకున్నాం కనుక మన మత్స్యకార కుటుంబాలకు దగ్గరగా ఉన్న బెల్లం వినాయక గుడినీ మనమే స్వధీనం చేసుకుని నడుపుకోవాలని నిర్ణయించినట్లుగా చెప్పడం బాధాకరం అన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయం ఆ శాఖ ఆదేశాలూ నియమనిబంధనలూ పాటించాలనీ., మీరిలా మాట్లాడ్డం సరికాదనీ చెప్పినా వినడం లేదని విచారం వెలుబుచ్చారు. పైగా మాట్లాడ్డానికి రావాలని వీళ్లూ పోలీసు సీఐ గారు రమ్మన్నారంటూ పోలీసులూ పిలుస్తున్నారని అన్నారు. బుధవారం భక్తులు బెల్లం వినాయకుని దర్శనానికి వచ్చే హమయంలో ప్రవేశ ద్వారం వద్ద

మూకుమ్మడిగా అలజడి సృష్టించడ బాధాకరం అని శర్మ వాపోయారు. హైకోర్టు డివిజన్ బెంచ్ ట్రస్టు వేసేందుకు కానీ., ఈవో నియామకం కానీ జరిపేందుకు వీలు లేదంటూ ఇచ్చిన తీర్పు గురించి చెప్పినా వినలేదన్నారు. పైగా స్థానిక/ మత్స్యకార కుటుంబీకులను రెచ్చగొట్టే విధంగ చేస్తున్న కూడదన్నా వినిపించూకోవడం లేదన్నారు. ఆశిస్సులతో భక్తులకు సేద తీర్చే బెల్లం గణపతిని కొలిచే అర్చకులమైన మమ్మల్ని మానసికంగా భయభ్రాంతులకు గురి చేయకుండా జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ చూడాలని శర్మ కోరారు.

మరీ ముఖ్యంగా బెల్లం గమపతిగ పిలిచే ఆనంద గణపతి ఆలయంకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా తమపై తాతాజీ., అయ్యప్ప్., సురకుల శ్రీనులూ లేదా వారి తరపు వారివల్ల కానీ వస్తున్న బెదిరింపులూ ప్రమాదాల నుంచి కాపాడాలని శర్మ మీడియా సమావేశంలో కోరారు.

# విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములగాడ : (విజయభాను న్యూస్ ): శ్రీహరిపురం, ములగాడ సబ్-స్టేషన్ పరిదిలో అన్ని ఫీడర్స్ నిర్వహణ నిమిత్తం ఐ ఎన్ ఎస్ ఎకశీల మెయిన్ గేట్ నుండి సబ్ స్టేషన్ వరకు కొత్తగా నిర్మించబడిన ఎలక్ట్రికల్ టవర్లు పై కొత్తగా వైర్లు ఏర్పాటు చేయుట నిమిత్తం శుక్రవారం ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 05:00 వరకు క్రింద పేర్కొనబడిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ డి ఇ ప్రసాద్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

అశోక్ నగర్,ఎం ఐ జి ,నక్కవానిపాలెం,సంజీవయ్య కాలనీ, ఎక్స్ సర్వీస్ మెన్ కాలనీ ,ములగాడ హౌసింగ్ కాలనీ,యం ఆర్ ఓ ఆఫీస్ ఏరియా, గొందెశివానిపాలెం ,వెదురువానిపాలెం ,ములగాడ, కోడిపందాలదిబ్బ ,శ్రీనివాస నగర్, దుర్గా బార్ ఏరియా, కుంచమాంబ కాలనీ, గుల్లలపాలెం,రామ్ నగర్, కారాడ వీధి, పాత రామాలయం,శ్రీహరిపురం మెయిన్ రోడ్ , శ్రీరామ్ నగర్, జవహర్ నగర్, పిలకవానిపాలెం,శాంతగిరి కాలనీ, గాంధీ మార్కెట్, గణపతి నగర్,బర్మా కాలనీ విద్యుత్ సరఫరా నిలిపివేయాబడునని వినియోగదారులు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు.

మొదటి పేజీ తరువాయి

# దుబాయ్ ఎక్స్ పోలో ఆకట్టుకున్న ఏపి

ప్రభుత్వమూ ఇంత డబ్బు ఇవ్వలేదని, రోడ్ల కోసం ఖర్చు చేయలేదని సిఎం పేర్కొన్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రోడ్లకు ఇచ్చింది కేవలం రూ.1,600 కోట్లు మాత్రమేనని గుర్తుచేసారు. రాష్ట్ర ప్రబుత్వం ఆరోగ్యశాఖలో వివిధ కేడర్‌లలో 2,588 పోస్టులు భర్తీ చేయనుందని తద్వారా ఆశాఖ సజావుగా తన కార్యకలాపాలు సాగించుకోవచ్చని అన్నారు. రాష్ట్రంలోని యువతకు ఇది శుభవార్తని అన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు సృష్టించి వారి సామర్ధ్యాన్ని వినియోగించుకోవాలనే ముఖ్యమంత్రి ఆలోచనలకు ఇది అద్దం పడుతుందని అన్నారు. గుంటూరు సర్వజనాస్పత్రిలో క్యాన్సర్ రోగికి అరుదైన చికిత్స చేసిన వైద్య బృందానికి అభినందనలు తెలియజేసారు. ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యపరికరాలు అందుబాటులో ఉండటంతో నిపుణులైన వైద్యులు స్టీరియోటాక్టిక్ రేడియో సర్జరీని విజయవంతంగా నిర్వహించి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా నిలిచారని అన్నారు.

ఏపి వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ వివిధ ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో డిజిటల్ పద్ధతిలో విక్రయాలను సాగించడంతో అనతికాలంలోనే అద్భుతాలు సృష్టించిందని అన్నారు. గత 10 నెలల్లో 40 లక్షల విలువైన చేనేత ఉత్పత్తుల విక్రయాలను జరిపిందని అన్నారు.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించనున్న 'జగనన్న తోడు' పథకం 3వ దశ రాష్ట్రంలో 1.5 లక్షల మంది లబ్ధిదారులకు లబ్ది చేకూర్చనుందని అన్నారు. చిరు వ్యాపారులకు ఆర్థిక సహాయం అందించి వారికి ప్రోత్సహించాలన్న ఏపి ప్రబుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో రూపుదిద్దుకుంటున్న అంబేద్కర్ స్మృతి వనం- 125 అడుగుల డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహం భారత రాజ్యాంగ నిర్మాత మరియు అణగారిన వర్గాల హక్కుల పోరాట యోధుడిని గౌరవించుకోవాలనే ముఖ్యమంత్రి అంకితబావాన్ని తెలియజేస్తుందని అన్నారు కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్రంలో నేడు (గురువారం) పర్యటించనున్నారని, సీఎం జగన్ తో కలిసి రహదారులు, ఇతర ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, భూమిపూజ నిర్వహిస్తారని అన్నారు. కొత్తగా నిర్మించిన విజయవాడ బెంజ్ సర్కిల్ పశ్చిమ ఫ్లై ఓవరను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఏ సీజన్లో పంటనష్టం జరిగినా ఆ సీజన్ ముగియకముందే పరిహారం చెల్లిస్తూ రైతన్నకు సీఎం జగన్ తోడుగా నిలుస్తున్నారని అన్నారు. ఇన్పుట్ సబ్సిడీ, వైఎస్సార్ యంత్రసేవ తదితరాల కింద రైతులకు ఇటీవల రూ.572 కోట్లు జమచేశారని గుర్తుచేసారు. రాష్ట్ర చరిత్రలోనే కాదు ఏ రాష్ట్రంలోనూ ఇలా రైతులకు తోడుగా నిలిచిన దాఖలాలు లేవని అన్నారు. గత సర్కారు ఆదుకోకపోగా ఎగ్గొట్టి రైతన్నల వెన్ను విరిచిందని అన్నారు. జగనన్న సంపూర్ణ గృహ హక్కు(ఓటిఎస్) పథకం లబ్ధిదారులకు వరంలా మారిందని, మిక్కిలి సంతోషంతో వారు ఈ సదవకాశాన్ని వినియోగించుకునేందుకు ముందుకు వస్తున్నారని అన్నారు. ఇప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా 9,69,786 మంది ముందుకొచ్చారు. వీరిలో 3,69,139 మంది పేర్లపై ఆస్తుల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యిందని అన్నారు. పథకంపై లబ్ధిదారుల హర్షం వ్యక్తం చేస్తున్నారని, తెదేపా అధికారంలో ఉన్నప్పుడు ఓటీఎస్ కింద వడ్డీ రాయితీకి చంద్రబాబు ససేమిరా అన్నాడని నాడు ఆయన పట్టించుకోకపోగా నేడు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నాడని అన్నారు.

## విధానాలను అధ్యయనం చేయండి

ప్రవేశించకూడదు. ఆ మేరకు పటిష్టమైన ఎస్ఓపీలను అమలు చేయాలని సీఎం ఆదేశించారు.

**ఉచిత రిజిస్ట్రేషన్ల వల్ల పేదలకు భారీ లబ్ధి:**

ఉచితంగా రిజిస్ట్రేషన్లు వల్ల భారీగా పేదలకు భారీగా లబ్ధి చేకూరిందన్న అధికారులుఓటీఎస్ పథకం ద్వారా, ఉచిత రిజిస్ట్రేషన్ల రూపేణా పేదలకు ఇప్పటివరకూ రూ.400.55 కోట్ల లబ్ధి చేకూరిందన్న అధికారులు, టిడ్కో ఇళ్ల ఉచిత రిజిస్ట్రేషన్ల రూపేణా పేదలకు మరో రూ.1230 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్న అధికారులు గతంలో ఎన్నడూకూడా ఉచిత రిజిస్ట్రేషన్ల రూపంలో పేదలకు ఇంతటి ప్రయోజనం జరగలేదన్న అధికారులు

# నగారాభివృద్ధికి చేయూతనివ్వండి

ర్యాంకు సాధనకు మీ అందరి కృషి ఎంతో అవసరమని, స్వచ్ఛ సర్వేక్షణ్ పై ప్రజలకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ నగరం సుందరీకరణకు తోడ్పాటు అందించేందుకు సహకరిస్తామని ముఖ్యంగా ఖాళీ స్థలాలలో వ్యర్ధాలు పడవేసే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంత ప్రజలకు వ్యర్ధాలు వేయకుండా అవగాహన కల్పించి ఆ ప్రాంతాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని, మాటవినకుండా చెత్త వేసే వారికి అపరాధ రుసుం వసూలు చేయాలని, ఖాళీ స్థలాలలో ఉన్న వ్యర్ధాలు, పిచ్చి మొక్కలను ఆ స్థల యజమానులతో శుభ్రం చేయించాలని, లేని యడల జివిఎంసి వారు తొలగించి స్థల యజమానికి శుభ్రం చేయుటకు అయ్యే ఖర్చును వసూలు చేయాలని, ఫుట్ పాత్ లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, రోడ్డు మార్జిన్ లో ఆక్రమణలను తొలగించాలని, కొన్ని చోట్లు అక్రమంగా దుకాణాలు వెలుస్తున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించి తొలగించాలని, నగర ప్రజలకు శుభ్రత, సేంద్రీయ ఎరువు తయారి, ప్లాస్టిక్ సంచుల బదులు గుడ్డ సంచులు వాడకం తదితర అంశాలపై వార్డు సచివాలయ కార్యదర్శులద్వారా ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలని, నగరంలో ఉన్న ప్రతి పార్కులో లౌడ్ స్పీకర్ల ద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం పైన, సేంద్రీయ ఎరువు తయారు చేయు పద్ధతుల పైన ప్రజలకు ఉదయం, సాయంత్రం రెండు పూటలా వినిపించాలని సూచించారు. అనంతరం, కమిషనర్ స్పందిస్తూ తమ అనుభవాలను, సూచనలను, సలహాలను తెలియపరచినందుకు ధన్యవాదాలు తెలుపుతూ జివిఎంసి చేపట్టే ప్రతి పనిలో ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ (APFERWAS) వారు, ఎన్.జి.ఒ.స్, ఇతర సంఘాల ప్రజా ప్రతినిధులు సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

ఈ సమావేశంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్ జి. శాస్త్రి, ఎఎంఒహెచ్ లు, APFERWAS ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందేది భారత ఆర్థిక వ్యవస్థే

అంచనాలను ఐఎంఎఫ్ కుదించిందని గుర్తుచేసింది. గత బడ్జెట్‌ల ద్వారా నిర్దేశించిన మార్గాలను తాజా బడ్జెట్ మరింత బలపరచనుందని తెలిపింది. కొవిడ్ మూడో దశలోనూ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా నిలబడగలిగిందని నివేదిక తెలిపింది. విద్యుత్తు వినియోగం, తయారీ కార్యకలాపాలు, ఎగుమతులు, ఈ-వే బిల్లుల జనరేషన్ వంటి అంశాల్లో నమోదైన గణాంకాలే అందుకు నిదర్శనంగా నిలుస్తోందని పేర్కొంది. కొవిడ్-19 వల్ల నెలకొన్న గందరగోళ పరిస్థితులు క్రమంగా తొలగిపోతాయని.. డిమాండ్ పుంజుకుంటుందని వెల్లడించింది. తద్వారా ప్రైవేటు పెట్టుబడులు పెరిగి ఉత్పత్తి గాడిలో పడుతుందని వివరించింది.

## ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు బప్పీ లహరి ఇకలేరు

షరాబీ, డర్టీ పిక్చర్ లాంటి అనేక మూవీల్లోని పాటలతో బాలీవుడ్‌ను ఉర్రూతలూగించిన బప్పీ దా సింహాసనం సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమయ్యారు. సూపర్ స్టార్ కృష్ణ, చిరంజీవి, బాలకష్ణ లాంటి స్టార్ హీరోల సినిమాలకు అదిరిపోయే మ్యూజిక్ అందించారు. బప్పీదా అనగానే సింహాసనం సినిమాలో ఆకాశంలో ఒక తార పాట గుర్తొస్తుంది. అలాగే బాలకృష్ణ రౌడీ ఇన్స్పెక్టర్, నిప్పురవ్వ , చిరంజీవి గ్యాంగ్ లీడర్, బిగ్ బాస్, స్టేట్ రౌడీ మూవీల్లోని పాటలు సూపర్ హిట్ అయ్యాయి. అలాగే మెహన్ బాబుకు రౌడీగారి పెళ్లాం, పుణ్యభూమి నా దేశం, బ్రహ్మ లాంటి సినిమాలకు ట్యూన్స్ అందించారు బప్పీ. బప్పీ మ్యూజిక్ అయినా, పాటలైనా ఎప్పటికీ ఎవర్ గ్రీనే. డిస్కో, ఫాస్ట్ బీట్స్, వెస్ట్రన్, క్లాసిక్ మిక్స్డ్ ట్యూన్స్‌తో ఆడియన్స్ మైమరిచిపోయారు.

ముఖ్యంగా 70, 80 90వ దశకంలో తన సంగీతంతో సంచలనం సృష్టించారు. చివరగా 2020లో భాగి 3లోను, రవితేజ హీరోగా నటించిన డిస్కో రాజా సినిమాలో టైటిల్ సాంగ్ పాడారు. ఆయన మ్యాజిక్‌కు ఎలాంటి వారైనా స్టెప్స్ వేయాల్సిందే. ఐయామ్ ఏ డిస్కో డ్యాన్సర్ అంటూ డిస్కో సాంగ్స్‌తో యూత్‌ను ఉర్రూత లూగించారు. 1973 లో బాలీవుడ్‌మూవీ నన్హా షికారి, 1974 తొలి చాన్స్ అందుకున్న బప్పీ లహరి తన కంపోజిషన్‌తో ఆకట్టుకున్నాడు. తరువాత 1975లో జఖ్మీ మూవీ కెరీర్‌కు మలుపు తిరిగింది, క్రమంగా ప్లేబ్యాక్ సింగర్‌గా కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 1976 చల్తే చల్తే డూపర్ సూపర్ హిట్ అయింది. జాతీయ స్థాయిలో సంగీత దర్శకుడిగా గుర్తింపు తెచ్చారు. 1986లో 33 సినిమాలకు 180కి పైగా పాటలను రికార్డ్ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నారు. ం

# ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు - ఎమ్మెల్యే అధీప్‌రాజు



సబ్బవరం (విజయభాను న్యూస్) : నేటి ముంగిటకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే అదీప్ రాజు పేర్కొన్నారు. మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీలో బుధవారం జోడిగుళ్ళు దరి 15 లక్షలు నిధులు తో డ్రైనేజ్ కాలవ పనులకు ఎమ్మెల్యే అదీప్ రాజు శంకుస్థాపన చేశారు. ఈ డ్రైనేజ్ కాలవ సిరపరపు ఇంటి దగ్గర నుండి కర్రీ వారి ఇంటి వరకు మరియు జోడుగుళ్ల దరి మండల సముద్రం ఇంటి నుండి కర్రి శ్రీను ఇంటి వరకు మరియు మైనర్ రిపేర్లు కు కలిపి 15 లక్షల నిధులతో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్ రాజు మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే వాలంటీర్ల వ్యవస్థ ద్వారా అందిస్తున్నామని అన్నారు. మేజర్ పంచాయతీలో వార్డు మెంబర్లు పార్టీలకతీతంగా గ్రామ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తున్నందుకు ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పది మంది టీడీపీ నుంచి వచ్చిన కార్యకర్తలను ఎమ్మెల్యే అదీప్ రాజు సాదరంగా ఆహ్వానించి వైసిపి కండువాలు కప్పారు ఈ సందర్భంగా వీరు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, ఎంపీపీ బోకం సూర్యకుమారి, రామునాయుడు, సర్పంచ్ ప్రసాద్ రావు ,వైస్ సర్పంచ్ మండల లక్ష్మణ ,వైసీపీ నేతలు సబ్బవరపు నారాయణమూర్తి ,మండల సముద్రం ,సాలాపు వెంకటేశ్వరరావు, కాపుశెట్టి శేషు, కే వెంకట రమణ, పల్లా కృష్ణ ,కర్రీ బాబు, పల్లా తాతారావు, బైలపూడి దేవుడు బాబు ,బంతికోల్ల పద్మ ,డి పద్మావతి, సబ్బవరపు సత్యనారాయణ బుజ్జి , సబ్బవరపు నాగభూషణం, గొర్లి శ్రీనివాసరావు, టి శేఖర్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 8వ రోజుకు కొనసాగుతున్న వీఆర్‌ఏల దీక్ష



అరకులోయ (విజయభాను న్యూస్) : విఆర్ఎల సమస్యలను వెంటనే పరిష్క రించాలని అరకులోయ తహసీల్దారు కార్యాలయం ఎదురుగా విఆర్.ఏ లు రిలే నిరాహారదీక్షలు రెండవ రోజు కొనసాగుతంది. ఈ సందర్భంగా విఆర్.ఏలు సంఘం మండల కార్యదర్శి బి.కొండు మాట్లాడుతూ...

విఆర్ఎలకు 21 వేలు వేతనం చెల్లించి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఇచ్చిన డిఏ రికవరీ ఉత్తర్వులు ఉపసంహరించాలని,డిఏతో కూడిన వేతనం చెల్లించాలని, నామినీలుగా పనిచేస్తున్న వారందరినీ విఆర్ఎలుగా నియమించి ఆకుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్క విఆర్ఎకు విఆర్వో ,వాచ్మెన్, ఆడిటర్ పదోన్నతి కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను విఆర్ఎలకు వర్తింప చేయాలని, 65 సంవత్సరాలు దాటి చనిపోయిన విఆర్ఎల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో...

విఆర్ఏ కార్యవర్గ సభ్యులు నారాజి అప్పారావు, వీఆర్ఏలు ఎస్.గుండు, కె .గోపన్న, కె. మొత్తి, కె.సరోజిని, తిమోతి, పైడితల్లి, రుక్మిణి,బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్దాలుగా నిస్వార్ధంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సేవా తత్పరుడు కందుల నాగరాజును అందరూ ఆదర్శంగా తీసుకోవాలి విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ



అక్కయ్యపాలెం (విజయభాను న్యూస్) : దశాబ్దాలుగా నిస్వార్ధంగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న సేవాతత్పరుడు కందుల నాగరాజు ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు.బుధవారం ఎంపీ కార్యాలయంలో జీవీఎంసీ 43 వ వార్డుకు చెందిన వధువు వీ,మాధవి,32 వ వార్డుకు చెందిన వధువు పీ.ఇందు లకు ఎంవీవీ చేతుల మీదుగా కందులనాగరాజు ఏర్పాటు చేసిన బంగారు తాళిబొట్లు,పట్టు వస్త్రాలు,గాజులు, పసుపు, కుంకుమ లను అందచేశారు.ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ చిరకాలంగా కందుల నాగరాజు చేస్తున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా వార్డు ప్రజలు ఘన విజయంతో కార్పొరేటర్ గా గెలిపించారన్నారు. అయన కుల,మత, రాజకీయాల కతీతంగా అన్నివర్గాల వారికి సహాయం చేస్తున్నారని కొనియాడారు. కందుల నాగరాజు మాట్లాడుతూ పాతికేళ్ల క్రితం కేఎన్ఆర్ ట్రస్ట్ స్థాపించిన దగ్గర్నుంచి ప్రజలకు ఎన్నో సేవ లందించినట్లు తెలిపారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆకాంక్ష మేరకు, రాజ్యసభసభ్యుడు విజయసాయిరెడ్డి స్ఫూర్తితో మరిన్ని సేవాకార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తిపరాయణుడైన నాగరాజు సహాయంతో,ఎంవీవీ చేతులమీదుగా తాళిబొట్లు, పట్టు వస్త్రాలు అందుకోవడం తమ జీవితంలో మరపురాని అనుభూతిగా నిలుస్తుందని వధువులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు,కేఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు కందుల కేదార్ నాథ్,కందుల బదరీనాథ్,భవాని రెడ్డి,రమేష్, నీలబాబు, జానకి, విజయ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



గాజువాక : (విజయభాను న్యూస్ ): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీ వీ ఎం సీ 76 వ వార్డు డైరీ కాలనీ-2 లో ఇటీవల అభివృద్ధి చేసిన పార్కును వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్క్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక నియోజక వర్గం అభివృద్ధి దిశగా తీసుకు వెళ్లేందుకు పనులు చేపడుతున్నామని తెలిపారు. వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్కులో ఉదయం, సాయింత్రం వేళలో వాకింగ్ చేసుకునేందుకు వీలుగా గ్రావెల్ తో వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేశామని, అలాగే సాయింత్రం వేళలో సేద దీరేందుకు సిమెంట్ బెంచ్ లు ఏర్పాటు చేశామని తెలిపారు.

అలాగే పార్క్ లో పచ్చదనం పెంచేందుకులో మొక్కలు నాటామని అన్నారు. వాటిని పరిరక్షించేందుకు గేట్స్ యేర్పాటు చేశామని త్వరలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో

మంత్రి రాజశేఖర్, మంత్రి శంకర నారాయణ, దొడ్డి రమణ, మూర్తి(గోపి), విశ్వనాధం, చిరంజీవి, వేణు, త్రినాధ్, శంకర్, కృష్ణ, రాము, కళావతి, గీత బాల, సతీష్, కాలనీ యూత్ సభ్యులు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# మాకవరపాలెం మండలం టీడీపీ అధ్యక్షులుగా రుత్తల యర్రాపాత్రుడు



నూతన కార్యవర్గం

మాకవరపాలెం (విజయభాను న్యూస్) : నర్సీపట్నంలో జరిగిన టిడిపి పార్టీ సమావేశంలో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మాకవరపాలెం మండల టిడిపి పార్టీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మండల పార్టీ టిడిపి అధ్యక్షులుగా రుత్తల యర్రాపాత్రుడు, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలిగా మాకవరపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ అల్లంపల్లి శిరీష ను, తెలుగు యువత అధ్యక్షుడిగా బిఎస్‌పేట గ్రామానికి చెందిన పాసపు సురేష్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా అల్లంపల్లి శిరీష మాట్లాడుతూ 2024లో తిరిగి టిడిపి పార్టీని అధికారంలోకి తీసుకు రావడానికి ఇప్పటి నుండే శక్తివంచన లేకుండా అంకితభావంతో పని చేస్తామన్నారు. ఈ సమావేశంలో మండల టిడిపి నాయకులు రుత్తల శేషు కుమార్, అల్లు రామునాయుడు, జోగి పాత్రుడు, దుంగల వెంకటరమణ, రుత్తల నందకిషోర్, కోసూరు శ్రీను లాలం రాము, తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న స్వచ్ఛ సంకల్పంలో ట్రై సైకిల్స్ పంపిణీ

## ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అధీప్‌రాజ్





పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా సుమారు 8 లక్షల 87 వేలు 352 రూపాయిలు విలువ చేసే ట్రై సైకిల్స్, టాయిలెట్ క్లీనర్స్, చెత్త బుట్టలు ను పెందుర్తి శాసనసభ్యులుఅన్నంరెడ్డి అదీప్ రాజ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం సచివాలయం సిబ్బంది కి 3 జతలు యూనిఫామ్ దుస్తులును పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్ గారు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లాడుతూ ప్రజలకు అన్ని విధాలా సేవలు అందిస్తున్న సచివాలయం సిబ్బందికి తగిన గౌరవం ఇవ్వడానికే ప్రభుత్వం వారికి యూనిఫామ్ లు ప్రేవేశపెట్టిందని ఎమ్మెల్యే అదీప్ రాజ్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సంక్షేమ కార్యక్రమాల అమల్లో ఏ మాత్రం వెనుకంజ వేయడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు వచ్చేలా సచివాలయం సిబ్బంది కృషి చేయాలని కోరారు. యూనిఫామ్ వల్ల గుర్తింపు వస్తుందని తద్వారా తమసమస్యలు చెప్పొకోవడానికి ప్రజలు వారికి దగ్గర అవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరవాడ ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మి శ్రీనివాసరావు, పరవాడ జడ్పీటీసీ పైల సన్యాసి రాజు , పరవాడ ఎంపిడిఒహేమ సుందరరావు , పరవాడ వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరరావు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పల నాయుడు , జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు , పెందుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పైల అప్పలనాయుడు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు,గొర్లివాన్నిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు,భరణికం సర్పంచ్ పెదిశెట్టి పూజ శేఖర్, తిక్కవాన్నిపాలెం సర్పంచ్ చేపల మసేను, కలపాక సర్పంచ్ బోండా కనకరావు, పి బోనంగి సర్పంచ్ బండారు కల్పన రాజ్ శేఖర్, గొర్లివాన్నిపాలెం ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకు నాయుడు, వెన్నలపాలెం ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, ఇఏఆర్ డి పద్మజ, ప్రభుత్వ అధికారులు, వై.సి.పి ముఖ్య నాయకులు డెక్క శ్రీనివాసరావు, యమహా నాయుడు, పంచాయతీ కార్యదర్శిలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింహాద్రినాధునికి వైభవంగా నిత్యకల్యాణం

## ఘనంగా గరుడ సేవ





సింహాచలం (విజయభాను న్యూస్) : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బుధవారం నాడు శ్రీ సింహాద్రి నాధుని నిత్య కల్యాణం అత్యంత ఘనంగా నిర్వహించారు, ఉత్సవంలో భాగంగా సింహాద్రి నాథుడు శ్రీదేవి భూదేవి అమ్మవార్లు ను అత్యంత సర్వాంగ సుందరంగా అలంకరించి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం జరిపించారు, తదుపరి స్వామివారి ఆర్జిత సేవలలో అత్యంత కీలకమైన గరుడ సేవను ఘనంగా జరిపించారు వేద మంత్రోచ్ఛారణల నడుమ మృదుమధుర మంగళవాయిద్యాల నడుమ సాగిన సేవల్లో భక్తులు పాల్గొని స్వామి వారి సేవలో తరించారు

# 500 టన్నుల ధాన్యం కొనుగోలు

మాకవరపాలెం (విజయభాను న్యూస్) : మండలంలో రైతుల నుంచి 500 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు మాకవరపాలెం మండల వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా వెయ్యి టన్నుల వరకు ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించామని, ఇప్పటివరకు 500 టన్నులను సేకరించామన్నారు. ఈ నెలాఖరు నాటికి లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

# శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ తల్లి మహోత్సవాలు బ్రోచర్ విడుదల



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : భీమిలి గ్రామదేవత శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ మహోత్సవాలు మార్చి 30 నుంచి ఏఫ్రిల్ 2వరకు ఘనంగా నిర్వహించ నున్నట్లు ఉత్సవ కమిటీసభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఉత్సవానికి సంబంధించిన బ్రోచర్ ను విడుదల చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30న తోలేళ్ళ ఉత్సవం, 31న అనుపు ఉత్సవం, ఏఫ్రిల్ 1న పాపమ్మ ఉత్సవం, ఏఫ్రిల్ 2న ఉగాది మహోత్సవం మరియు దుడ్డు అచ్చియ్యమ్మ మహోత్సవం ఘనంగా నిర్వహించ నున్నట్లు చెప్పారు. అనుపు మహోత్సవం సందర్భంగా ఆరోజు పులివేషాలు,సామగరిడీలు, కోలాటాలు, తప్పెటగుళ్ళు,కాళికా వేషాలు,కోబ్రా డాన్స్, కోయ డాన్స్ లతో పాటు బాణసంచా కార్యక్రమం ఉంటుందని చెప్పారు. అంతేకాకుండా నాటకాలు, బుర్రకథ,ఆర్కెస్ట్రా గుడి స్టేజ్ వద్ద, గంటస్థంబం స్టేజ్ వద్ద, చిన్నబజార్ స్టేజ్ వద్ద జరగనున్నట్లు తెలిపారు. అమ్మవారి చాటింపు కార్యక్రమం మార్చి 19న అమ్మవారి గుడి నుంచి చదును పట్టు వరకు రాత్రి 12గంటలకు ఊరేగింపుగా తీసుకుని వెళతారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో...

ఉత్సవ కమిటీ అధ్యక్షులు మైలపిల్లి లక్ష్మణరావు,కార్యదర్శి కనకల అప్పలనాయుడు ,కోశాధికారి పాసి మధుసూధనరావు,ఆర్గనైజింగ్ సెక్రటరీ వాసుపిల్లి ఎల్లాజీరావు కో ఆర్డినేటర్ వాడమొదలు జగ్గారావు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మైలపల్లి .షణ్ముఖ రావు, గంటా నూకరాజు, కె.ముత్యాలరావు, అల్లిపిల్లి. నరసింగరావు, పి.యోగి, కె.ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### హింసా ప్రవృత్తికి మూలమెక్కడ?

గాంధీజీ అహింసా సిద్ధాంతం చాలా విస్తృతమైంది. ఆచరణలోనే కాదు, ఆలోచనలో కూడా అహింసా సిద్ధాంతాన్ని ఆయన ప్రవచించారు. సాంఘిక కార్యాచరణలో అనుసరించే క్రమశిక్షణా పద్ధతి మాత్రమే కాక, ఆలోచనా విధానాన్ని క్రమబద్ధం చేసుకోవడం ద్వారా జీవిత విధానాన్నే అహింసా సిద్ధాంతానికి అనుగుణంగా మలచుకోవడం ఆయన సిద్ధాంతంలోని విశిష్టత. మరో మాటలో చెప్పాలంటే గాంధీజీ అహింసా సిద్ధాంతం అనేది మనసులో బాగా నాటుకొని పోవలసిన సిద్ధాంతం. ఆచరణలోనూ, ప్రవర్తనలోనూ దాని ప్రదర్శన మానసిక స్థితి బాహిర ప్రదర్శన మాత్రమే. అయితే మామూలుగా మనం హింస గురించి మాట్లాడుకునేటప్పుడు మనం చర్చించే హింస, సాంఘిక కార్యాచరణ క్రమంలో బయటపడుతున్న హింస గురించే కాని, మానసిక స్థితి గురించి కాదు.

అటు సాంఘిక కార్యాచరణలకూ, ఇటు వ్యక్తిగత కార్యాచరణకూ కొన్ని పద్ధతులను నిర్ణయించిన గాంధేయ విధానం- గాంధీజీ సిద్ధాంతాలూ ఒక పునాదిగా, మార్క్సిజం మరో పునాదిగా, ఆధునిక సాంఘిక శాస్త్రం మరో పునాదిగా తీసుకొని అధ్యయనం చేసినట్లయితే, ఈ వైఖరులను వివేచన చేసుకోవడానికీ, నూతన పద్ధతులనూ, విలువలనూ రూపొందించుకోవడానికి అవకాశం ఉంటుంది. పునాది ఏదైనా కానీ ఈ సమస్యను గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేయడం ఈనాటి ముఖ్యావసరమనేది నిర్వివాదాంశం.

ప్రజాస్వామ్య ప్రభుత్వాలు గాంధీజీ అన్నట్లు మెజారిటీ ఏకపక్షపాలనగా మారే ప్రమాదం ఉన్నది కనుక ప్రజాస్వామ్యంలో మైనారిటీలకు కొన్ని రక్షణలు కల్పించవలసి ఉంటుంది. పేదలు మైనారిటీలుగా రూపొందిన అమెరికాలో ఇది నేటి ప్రధాన సమస్య.

విభిన్న సమాజాల మధ్య సామూహిక హింసా చర్యలను గురించి లేదా సాంఘిక కార్యాచరణ సాధనంగా హింసను వాడటాన్ని గురించి పోల్చి చర్చించడానికి మనం పూనుకున్నప్పుడు ఆయా సమాజంలోని వ్యక్తులలో- మానవ ప్రవృత్తిలోనే హింసాయుత వైఖరులు అధికంగా ఉండటం కారణమనే నిర్ణయానికి రావడంవల్ల తరుచుగా తప్పటడుగు వేయడం జరుగుతుంది. అయితే మన సమాజంలో మొదటినుంచీ ఉండి ఇప్పటికీ కొనసాగుతూ, ఇటీవలి కాలంలో మరింత తీవ్రతను సంతరించుకున్న వైఖరులను జాగ్రత్తగా ప్రశాంత చిత్తంతో పరిశీలించినట్లయితే పై నిర్ధారణ విధిగా వాస్తవికం కానక్కర లేదని తేలుతుంది. అందువల్ల హింసా ప్రవృత్తులకు అనుకూలమైన వైఖరి పెరుగుతున్నదనుకున్నప్పుడు మనం మానసిక ప్రవృత్తినీ, సాంఘిక పరిస్థితులనూ జాగ్రత్తగా వివేచన చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంటుంది. హింసాయుత వైఖరులకు ప్రధానంగా బాధ్యత వహించేవి ఈ పరిస్థితులే.

పోరాటం లేకుండా ఏ కోరికా సిద్ధించదనీ, ఏ కాస్తో హింసలేకపోతే ఏ పోరాటమూ ప్రభావము చూపదనే విశ్వాసం హింసా చర్యలు పెచ్చరిల్లడానికి ఒక కారణంగా చెప్పవచ్చు. దీనికి ప్రధాన కారణం, మారిన పరిస్థితులకు అనుగుణంగా మన ప్రజాస్వామ్య ప్రభుత్వాలు అవసరమైనంతమేర బాధ్యతాయుత వైఖరిని పెంపొందించుకోకపోవడం. అంటే దీని అర్థం స్వాతంత్రం రాకపూర్వం ఉన్న ప్రభుత్వాలు చాలా బాధ్యతాయుతంగా ఉండేవని కాదు. అయితే అవి బాధ్యతాయుతంగా ఉండాలని ఎవరూ ఆశించలేదు. స్వపరిపాలనకు అనుకూలంగా చెప్పిన కారణాల్లో ఇది కూడా ఒకటి. ప్రజలకు మేలు చేకూర్చి, ఆర్తులను ఆదుకోవలసిన బాధ్యత గల మన ప్రభుత్వ యంత్రాంగం నేడు ప్రజల సమస్యలనూ, వారి ఆకాంక్షలను అవగాహన చేసుకొని వారికి సంతృప్తిని కలిగించే చర్యలు చేపట్టేవిధంగా ఎదగకపోవడం విచారకరం. పరిపాలనా యంత్రాంగంతో సంబంధం ఉన్న అనధికార బృందం సభ్యులు అప్పుడప్పుడూ బాధ్యతాయుత వైఖరిని ప్రదర్శిస్తున్న మాట నిజమే కానీ, సంకుచిత ప్రయోజనాలు, స్వార్థ ప్రయోజనాలను సాధించుకోవడంలో తృప్తి పడి ప్రధాన సమస్య పరిష్కారం గురించి అంతగా పట్టించుకోవడం లేదు.

## టీటీడీ చైర్మన్ ను కలిసిన ప్రధానమంత్రి సాహస అవార్డు సాధించిన బాలిక



తిరుమల /తిరుపతి (విజయభాను న్యూస్):

జమ్మూకాశ్మీర్ లోని ఆర్మీ క్వార్టర్స్ లోని తమ ఇంటిమీద ఉగ్రవాదులు చేసిన దాడి నుంచి తల్లి, చెల్లెళ్లను సాహసోపేతంగా కాపాడి ప్రధానమంత్రి సాహస బాలిక అవార్డు పొందిన గురుగు హిమ ప్రియ బుధవారం టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి ని కలిశారు.

తన తల్లిదండ్రులు సత్యనారాయణ, పద్మావతి, తన ఇద్దరు చెల్లెళ్ళతో పాటు క్యాంప్ కార్యాలయంలో చైర్మన్ వై వీ సుబ్బారెడ్డిని కలిశారు. 2018 లో హిమప్రియ ఎనిమిదేళ్ళ వయస్సు లో ఉండగా ఈ సంఘటన జరిగింది. శ్రీకాకుళం జిల్లా పొన్నాం గ్రామానికి చెందిన ఈ బాలిక ధైర్య సాహసానికి మెచ్చి 2022వ సంవత్సరానికి గాను ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు ప్రకటించారు.

ఈ ఏడాది జనవరి 24 వ తేదీ శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ద్వారా హిమ ప్రియ ఈ అవార్డు అందుకున్నారు. ఈ వివరాలు తెలుసుకున్న చైర్మన్ వైవి సుబ్బారెడ్డి గారు బాలికను ఆమె తల్లిదండ్రులను అభినందించారు.

బాలిక తండ్రి సత్యనారాయణ ప్రస్తుతం పూణె లో ఆర్మీ హవాల్దార్ గా పని చేస్తున్నారు.

## ఫోక్సో స్పెషల్ పీపీ కరణం కృష్ణ కు అభినందనలు





విశాఖ సిటీ (విజయభాను న్యూస్) : విశాఖపట్నం జిల్లా ఫోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్స్ సెక్సువల్ ఎఫెక్షన్ యాక్ట్) స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన న్యాయవాది కరణం కృష్ణ కి వారి కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియ జేస్తున్న ఆంధ్రప్రదేశ్ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల రవీంద్ర భారత్, విజయభాను తెలుగు దినపత్రిక బ్యూరో చీఫ్ చిన్నబాబు సనపల, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకుడు బెవర మహేష్, అక్షర కిరణం రిపోర్టర్ ప్రగడ ప్రసాద్.



## వీఆర్ఏలకు సిఐటియు మద్దతు

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : గత 9 రోజులు నుండి చేరుకున్న వీఆర్ఏలు నిరసనలు కనీస వేతనాలు 21 వేలు చెల్లించాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని అర్హులైన వి ఆర్ ఏలు కు ప్రమోషన్లు కల్పించాలని గత తొమ్మిది రోజుల నుండి వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్న వీఆర్ఏలకు సి ఐ టి యు సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా భీమిలి సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు సిఐటియు నాయకులు రవ్వ నర్సింగ్ రావు ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 వేల మంది వీఆర్ఏలు పనిచేస్తున్నారని వీరికి కనీస వేతనాలు ఇతర హక్కులు లేకుండా వెట్టిచాకిరి చేస్తున్నారని వీరిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వీరి డిమాండ్ వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం నాయకులు బి సూరిబాబు ప్రెసిడెంటు సుత్తి అప్పారావు సెక్రెటరీ సామంతుల నరసింహారావు రేఖ తులసి తదితరులు పాల్గొన్నారు.

## ఏషియన్ కరాటే టోర్నమెంట్ లో భీమిలి షోడో షోటో కాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : ఈ నెల పది నుండి పద మూడు వరకు విశాఖ స్వర్ణ భారతీ స్టేడియం లో జరిగిన ఏషియన్ కరాటే టోర్నమెంట్ లో భీమిలి షోడో షోటో కాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులకు కాటా కుముతే విభాగాలలో రెండు రజత పతకాలు ఎనిమిది కాంస్య పతకాలు సాధించారని షోడో షోటో కాన్ కరాటే అసోసియేషన్ చీఫ్ కోచ్ ముగడ వెంకట రమణ యాదవ్ తెలియజేశారు. కుముతే విభాగంలో వారు కె సాయి చరన్ పి గౌతమ్ లకు రజత పతకాలు సాధించారు. కాటా విభాగం లో కె.మోహనశ్రీ. ,కె తేజశ్వన్ సాయి, కె సాయి చరన్, వై. వినీత్ రావు, ఉసిరికల.సుశాంక్, పి సంజయ్ లకు కాంస్య పతకాలు సాధించారు.

## సమత కళాశాలలో ఉచిత దంత వైద్య శిబిరం

విశాఖపట్నం, (విజయబాను న్యూస్) : సమత ఎన్.ఎస్.ఎస్ మరియు పార్ధ సూపర్ స్పెషాలిటీ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కళాశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. విజయ రవీంద్ర ప్రారంభించి, విద్యార్థులందరూ దంత సంరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సుమారు 200 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. శ్రీనివాస్, డాక్టర్. రాధా రాణి డాక్టర్.అనుపమ అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాదాలను తలపిస్తున్న కోనాపురం తారు రోడ్డు


### బొర్రా జంక్షన్ గేటు వలస నుండి లోతేరు జంక్షన్ వరకు తారు రోడ్డు మరమత్తు చేపట్టాలి

అనంతగిరి (విజయభాను న్యూస్) : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాచిపెంట శాంతకుమారి డిమాండ్. అరకునియోజకవర్గం. అనంతగిరి మండలం అనంతగిరి మండల కోనాపురం పంచాయతీ పరిధిలో పర్యటించారు బొర్రా నుండి లోతేరు జంక్షన్ వరకు తారు రోడ్డు, చప్పడి గ్రామసమీపంలో గల కల్వర్టు మరమ్మత్తుతక్షణమేచేపట్టాలనిఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరకు పార్లమెంట్ డిస్ట్రిక్ట్ ఇన్చార్జ్ శ్రీమతి పాచిపెంట శాంతకుమారి డిమాండ్ చేశారు. బుధవారం అనంతగిరి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంచాడి కృష్ణ ఆధ్వర్యంలో పలు గ్రామాలను పర్యటించిన ఆమె మాట్లాడుతూ.! గత 20 సం" కిందట కాంగ్రెస్ పార్టీ హయాంలో నిర్మించిన ఈ తారు రోడ్డు, అప్పటి నుండి నేటికీ వరకు గుంతలు పడి శిథిలావస్థలో చేరుకుందని, చాలా సార్లు స్థానిక ఎమ్మెల్యే గారికి ఉన్నత అధికారులకు అందించినప్పటికి పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు.! బొర్రా నుండి లోతేరు జంక్షన్ వరకు తక్షణమే ప్రభుత్వం స్పందించి తారు రోడ్లు మరమ్మత్తు నిర్మాణం పనులు చేపట్టాలని, సుమారు 15 కిలోమీటర్లు మేర రోడ్డు చాలా అస్తవ్యస్తంగా అధ్వానంగా మారిందని పెద్ద పెద్ద గుంతలతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారని, ఆస్పత్రికి గర్భిణీ స్త్రీలు వృద్ధులు మహిళలు వెళ్లడానికి 108 బండి మరియు రేషన్ పంపిణీ నిమిత్తం డోర్ డెలివరీ బండి వెళ్ళడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారని సుమారు 3 గ్రామ పంచాయతీకి చెందిన మారుమూల గిరిజన ప్రజలు విద్యార్థులు, చాలా ఇబ్బందులు పడుతు ఆవేదన చెందుతున్నారని, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి తారు రోడ్డు సౌకర్యం కల్పింభాలని ఆమె డిమాండ్ చెయ్యడం జరిగింది.!

ఈ కార్యక్రమంలో అనంతగిరి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంచాడి కృష్ణ మొస్య ప్రేమ్ కుమార్ డుంబ్రిగుడ కాంగ్రెస్ నాయకులు తడభారికి బిమారావు కిల్లో రాజు, జన్ని బాబురావు, కిల్లో ముత్యాలమ్మ, వార్డ్ నెంబర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, గిరిజన ప్రజలు, తదితరులు పాల్గొనడం జరిగింది.

## సంపదలను ప్రసాదించే శివుడు

సంకీర్తన



జీవితాన్ని ఆర్ధిక పరిస్థితి ఎంతగానో ప్రభావితం చేస్తుంది. అన్ని ఆనందాలు .. సంతోషాలు ఆర్ధిక పరిస్థితితో ముడిపడిలేకపోయినా, అది చూపించే ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. అవసరాలు .. ఆపదల బారినుంచి బయటపడటానికి ఆర్ధిక పరిస్థితి బాగా ఉండవలసిందే. అలాంటి పరిస్థితుల్లో ఆయురారోగ్యాలతో పాటు ప్రతి ఒక్కరూ సంపదలను కూడా భగవంతుడిని కోరుతుంటారు.

ఇలా సంపదలను పొందాలనుకున్నవాళ్లు, పరమశివుడిని పూజించడం వలన ఫలితం ఉంటుందని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. సోమవారం పరమ శివుడికి అత్యంత ప్రీతికరమైన రోజు. ఈ రోజున స్వామివారిని మారేడు దళాలతోను .. శంఖు పుష్పాలతోను పూజించడం వలన, సంపదలు చేకూరుతాయని ఆధ్యాత్మిక గ్రంధాలు స్పష్టం చేస్తున్నాయి. అందువలన ఆర్థికపరమైన ఇబ్బందుల నుంచి బయటపడాలనుకునేవాళ్లు, సదాశివుడిని ఈ రీతిగా పూజించి ఆయన అనుగ్రహాన్ని పొందవచ్చు.

### ఆపదలు తొలగించే అమ్మవారు

శక్తి స్వరూపిణి అయిన అమ్మవారు ఏ రూపంలో వున్నా .. ఏ పేరుతో కొలవబడుతూ వున్నా అమ్మ ప్రేమతో అనుగ్రహిస్తూనే ఉంటుంది. అందువల్లనే అమ్మవారి ఆలయాలు ఎక్కడ వున్నా భక్తులతో నిత్యం సందడిగా కనిపిస్తూనే ఉంటాయి. అమ్మవారిని పూజించడం వలన సౌభాగ్యం నిలుస్తుందని .. సంపదలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

ఇక అమ్మవారు ఆవిర్భవించిన 'అష్టమి' తిథి రోజున ఆ తల్లిని పూజించడం మరింత మంచిదని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. అష్టమి రోజున అమ్మవారిని పూజించడం వలన .. పారాయణం చేయడం వలన .. ఆ రోజున 8 రకాల వంటకాలు నైవేద్యంగా సమర్పించడం వలన విశేషమైన ఫలితాలు కలుగుతాయి. ముఖ్యంగా అనారోగ్యాలు .. ఆపదలు దరిచేరవు. జీవితాన్ని అనారోగ్యాలు .. ఆపదలు అతలాకుతలం చేస్తుంటాయి. అందువలన అలాంటి గండాల బారిన పడకుండా అష్టమి రోజున అమ్మవారిని ఆరాధిస్తూ ఉండాలి.



# రసవత్తరంగా సాగిన గుర్రపు పరుగు పోటీలు





దేవరాపల్లి,( విజయభాను న్యూస్) : మండల కేంద్రంలో శ్రీ ఉమా మహేశ్వరి దేవి తీర్థ మహోత్సవాలు పురస్కరించుకొని ఏర్పాటు చేసిన గుర్రం పరుగు పందాలు రసవత్తరంగా జరిగాయి. గత ఐదు రోజుల పాటు దేవరాపల్లిలో జరిగిన తీర్థ మహోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిసాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి గుర్రపు పరుగు పందాలు నిర్వహించారు. ఈ పోటీలను తిలకించేందుకు మండలం నలుమూలల నుంచి ప్రజలు తరలి రావడంతో దేవరాపల్లి గ్రామం రద్దీగా మారింది. పెద్ద మహో త్సవాల ముగిసిన సందర్భంగా అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది.

# నేటి నుండి 26వ తేదీ వరకు రత్నగిరి పై 'కోటి తులసి పత్రి' పూజ

అన్నవరం (విజయభాను న్యూస్) : తూర్పుగోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం అన్నవరం శ్రీ సత్య దేవుని సన్నిధిలో లోక కళ్యాణార్థం రాష్ట్రంలో గల ప్రజలందరూ కరోనా, ఓమిక్రాన్ వంటి వ్యాధి నుండి విముక్తి పొంది సస్యశ్యామలంగా ఉండుటకు గాను ది.17-02-2022 నుండి 26-02-2022 వరకు శ్రీ స్వామివారికి "కోటితులసి పత్రి పూజ" శ్రీ స్వామివారి వార్షిక కళ్యాణ మందిరము నందు సుమారు 50 మంది ఋత్విక్ లతో అత్యంత వైభవంగా నిర్వహించబడును. కావున భక్తులు సదరు పూజను ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని నిర్వహించుకునుటకు అవకాశం కల్పించుచూ రుసము రూ.1,500/-లు టిక్కెట్ విక్రయించబడును. సదరు పూజను పరోక్షంగా నిర్వహించుకున్న భక్తులకు వారు కోరిన రోజున పూజ నిర్వహించి,పోస్టల్ ద్వారా కండువా,జాకెట్టు,కుంకుమ అక్షింతలు పంపబడును.కావున భక్తులుaptemples.ap.gov.in ద్వారా రుసము చెల్లించి టిక్కెట్ పొందవచ్చునని దేవస్థానం కార్యనిర్వహణాధికారి తెలిపారు.



# ముత్యాలమ్మపాలెం సముద్రతీరాన పోటెత్తిన జనం

- పలు సంస్కృతి కార్యక్రమాలు
- సిఐ పెదిరెడ్ల ఈశ్వరావు అధ్వర్యంలో బందోబస్తు



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీలో మాఘ పౌర్ణమి సందర్భంగా ముత్యాలమ్మపాలెం సముద్ర తీరాన గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు అధ్వర్యంలో పలు సంస్కృతి కార్యక్రమాలు మరియు మహిళలకు స్నానపు గట్టాలు భక్తులకు మజ్జిగ మరియు మంచి నీరు పంపిణీ చేసారు. సముద్రతీరాన ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పరవాడ సర్కిల్ ఇన్స్ పైక్టర్ పెదిరెడ్ల ఈశ్వరావు అద్వర్యంలో ఎస్ ఐ లు రమేష్, రామకృష్ణ,సురేష్ లు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికిసహకరించిన పరవాడ పోలీసు వారికి మరియు రెవెన్యూ సిబ్బంది కి మరియు గ్రామ నాయకులు కు సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమం లోమండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, మాజీ ఎంపీటీసి చింతకాయల అమ్మోరు, మాజీ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, వైస్ ప్రెసిడెంట్ సూరాడ పెంటయ్య ,కణితి చినసోమేష్ తదుపరి నాయకులు పాల్గొన్నారు.

# రూ.120 .25 కోట్లతో మిషన్ కనెక్ట్ పాడేరులో రోడ్డు నిర్మాణం..

## ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ



పాడేరు (విజయభాను న్యూస్): మిషన్ కనెక్ట్ పాడేరు కింద ఏజెన్సీలో రూ 120.25 కోట్ల వ్యయంతో 166 రోడ్ల నిర్మాణాలు మంజూరు చేసామని పనులు త్వరితగతిన ప్రారంభించాలని ఐటిడిఏ పిఓ రోణంకి గోపాలకృష్ణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి 11 మండలాల గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధ రాళ్ల పంచాయితీలోని 34 హెబిటేషన్ కు13 పనులు రోడ్డు మంజూరు చేశామని పనుల నిర్వహణకు అవసరమైన ఇంజనీరింగ్ అసిస్టెంట్ నియమించాలని అధికారులను ఆదేశించారు. మండలాలకు మంజూరు చేసిన పనుల పై సమీక్షించారు. డుంబ్రిగూడ ,ముంచంగిపుట్టు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ప్రిన్సిపల్ క్వార్టర్లు, ఉపాధ్యాయుల క్వార్టర్లు, బోధనేతర సిబ్బంది నివాస గృహాలు ,వంటగది ,భోజన హాల్ పనులు, పురోగతిపై ఏ స్థాయిలో ఉన్నాయని ఆరా తీశారు. పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఎస్ ఈ ఎస్ శ్రీనివాస్,ఈ ఈ ,డి వి ఆర్ ఎం రాజు ,కె.వేణుగోపాల్ 11 మండలాల డిఇఈలు, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాతలకు డోనర్ సర్టిఫికెట్లు మరియు ఆశ్రమవాసులకు కళ్లద్దాలు పంపిణీ



అక్కయ్యపాలెం (విజయ భాను న్యూస్) : శ్రీ స్వామి వివేకానంద సంస్థ వారు శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావు గారి జయంతి రోజున నిర్వ హించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న రక్త దాతలకు డోనర్ సర్టిఫికెట్లు, వివేకానంద సంస్థ వృద్ధాశ్రమం లో గల ఆశ్రమ వాసులకు కళ్ళజోళ్ళు, ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏఎన్ బీచ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సిఎంఏ జహీర్ అహ్మద్, యువ నాయకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ, మరియు మసూద్ అహ్మద్ గారు చేతుల మీదుగా రక్త దాతలకు డోనార్ సర్టిఫికెట్లు మరియు ఆశ్రమ వాసులకు కళ్ళద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జహీర్ అహ్మద్ గారు మాట్లాడుతూ చిన్న వయసులోనే రక్తాన్ని దానం చేసిన రమా ప్రియ, జనని లను అభినందించారు. వీరిద్దరూ తన తండ్రి సురడా అప్పారావు ని (110 సార్లు అప్పారావు రక్తం ఇవ్వడం జరిగింది ఆదర్శంగా తీసుకొని ఈ దానికి ముందుకు అడుగు వేసినట్లు తెలిపారు. యువత అందరూ ముందుకు వచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తాన్ని దానం చేస్తే అనేక మందికి అనేక మంది ప్రాణాలు కాపాడవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అప్పారావు గారు సంస్థ సభ్యులు మరియు రామకృష్ణ రావు పాల్గొన్నారు.


# ఉపాధి హామీ లో రోజుకు లక్ష మందికి పని

## ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ..



పాడేరు (విజయభాను న్యూస్) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి రోజు లక్ష మందికి పనులు కల్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. ఉపాధి హామీ పథకం అధికారులకు ఎం పీ డీ వో లకు క్షేత్రస్థాయి సిబ్బంది కి ఉపాధిహామీ ఎస్ ఐ సి సాఫ్ట్ వేర్ పై స్థానిక కాఫీ హౌస్ లో బుధవారం నిర్వహించిన ఒకరోజు వర్క్ షాప్ కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ సాఫ్ట్ వేర్ ను టీ సి ఎస్ నుండి ఎం ఐ సి సాఫ్ట్ వేర్ కి మార్చారని దానిపై ఉపాధి హామీ అధికారులు సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. సాఫ్ట్ వేర్ లో ఎస్టిమేట్ జనరేట్ చేయడం మాస్టర్ రోల్ నమోదు వేతనాలు జమ చేయడం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు పొందిన లబ్ధిదారులకు 150 రోజులు పని దినాలు కల్పించాలని ఆదేశించారు. ఉపాధి కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీలో గుర్తించిన అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేయాలని చెప్పారు. లబ్ధిదారులకు ఉద్యానవనం మొక్కలు పంపిణీ చేయాలని సూచించారు. ఉపాధిహామీ సిబ్బంది ప్రతిరోజు ఉదయమే క్షేత్ర పర్యటనలు చేయాలన్నారు. ఎంపీడీవోలు ఉపాధిహామీ పురోగతిపై ప్రతిరోజు ఐటిడిఎ కార్యాలయానికి నివేదించాలని అన్నారు. మండలంలో రోజు పది వేల మంది కూలీలు పని చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఉపాధిహామీ ఏ పి డి జె గిరిబాబు ,చింతపల్లి ఏ పి డి రామారావు ,రిసోర్స్ పర్సన్లు సిహెచ్ ప్రశాంత్, షణ్ముఖ్ రావు, 11 మండలాల్లోఎంపీడీవోలు ,ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రాన్ని చింతపల్లిలో ఏర్పాటు చేయాలి



పడాల వీరభద్రరావు

గొలుగొండ (విజయ భాను న్యూస్) : అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రాన్ని చింతపల్లిలో ఏర్పాటు చేయాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. విశాఖజిల్లా పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను ప్రకటించి నందుకు ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్‌రెడ్డికి జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం తరపున ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అయితే పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పాటు చేయడం వల్ల రంపచోడవరం ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజల నుండి వ్యతిరేకతలు వెల్లువెత్తుతున్నాయన్నారు. రంప చోడవరం నియోజకవర్గం తెలంగాణా రాష్ట్రానికి సరిహద్దులో ఉన్న ఎటపాక డివిజన్ వరకు ఉందని, అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంగా ప్రకటించిన పాడేరు వెళ్లాలంటే 300 కిలో మీటర్లకు పైగా ప్రయాణం చేసి ప్రజలు ఎన్నో వ్యయప్రయాసాలుపడి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ ప్రాంతాలన్నీ ఏ అభివృద్ధికి నోచుకోకుండా ఉంటాయనే వాదనలు వినిపిస్తున్నాయన్నారు. అందువల్ల మధ్యేతరంగా స్వాతంత్ర కాలంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తాలుకా కాగా, ప్రధాన కేంద్రంగా ఉండి, ఇక్కడ నుండే కార్యకలాపాలు సాగించి, స్వాతంత్రం అనంతరం ఇటీవల కాలం వరకు శాసనసభ నియోజకవర్గంగా ఉన్న చింతపల్లిని అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంగా చేయడం సమంజసంగా ఉంటుందని భావిస్తున్నామన్నారు. అంతేకాకుండా అల్లూరి సీతారామరాజు 1922 ఆగస్టు 22న తొలిసారిగా చింతపల్లి పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి ఆయుధాలు స్వాదీనం చేసుకొని బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై ప్రత్యక్ష సాయుధ పోరాటానికి దిగడం, చింతపల్లి ప్రక్కనే ఉన్న కొయ్యూరు మండలం గంటం, మల్లుదొరల గ్రామమైన నడింపాలెంలో ప్రధాన స్థావరాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని చెప్పారు. కొయ్యూరు మండలంలో మంప గ్రామంలోని మంప చెరువు వద్ద పట్టుబడి, కొయ్యూరు లోని రాజేంద్రపాలెంలో వీరమరణం పొందటం జరిగిందన్నారు. అల్లూరి చరిత్రలో ఈ ప్రాంతాలు ప్రాధాన్యత సంతరించు కున్నాయన్నారు. చింతపల్లి జిల్లా కేంద్రంగా ప్రకటిస్తే అసంతృప్తితో ఉన్న రంప చోడవరం కొంత మేర సంతృప్తిపడే అవకాశం ఉందన్నారు. రంప చోడవరం నుండి దూరభారాలు, వ్యయ ప్రయాసాలు కూడా తగ్గుతాయన్నారు. రంప చోడవరం నియోజక వర్గంలో రంప చోడవరం, చింతూరులో రెండు ఐటిడిఏలు ఉన్నాయని, రంపచ ఓడవరం, ఎటపాకలు డివిజన్‌లుగా ఉన్నాయని, వాటికి ప్రత్యేక నిధులు కేటాయించి, రంప చోడవరం నియోజకవర్గం అభివృద్ధికి దోహదపడతామని ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇస్తే అక్కడ జ్రలు శాంతించవచ్చునని, పాడేరు జిల్లా కేంద్రంగా ఉంటే రంప చోడవరం ప్రాంతానికి 300 కిలో మీటర్లకు పైగా ప్రయాణం సాగించాల్సి వస్తుందన్నారు. అదే చింతపల్లి జిల్లా కేంద్రంగా ఉంటే 100 కిలో మీటర్లకు పైగా తగ్గే అవకాశం ఉందన్నారు. రంప చోడవరం 171కిలో మీటర్లు, దేవీపట్నం 180కిలో మీటర్లు, చింతూరు 143కిలో మీటర్లు, గంగవరం 160 కిలోమీటర్లు, మారేడుమిల్లి 205కిలో మీటర్లు కుదింపబడతాయన్నారు. చింతపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే రంప చోడవరం ప్రజలకు కొంత మేర ఉపశమనం కలుగుతుందని, కావున ప్రజలకు, ప్రభుత్వ పరిపాలనకు సౌలభ్యంగా ఉండే విధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను చింతపల్లి కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు.

# జిసిసి డ్రైవర్ల సమస్య ప్రభుత్వానికి పట్టదా?



అరకులోయ (విజయభాను న్యూస్) : విశాఖ ఏజెన్సీ ప్రాంతాలలో గల గిరిజన కార్పొరేషన్ సొసైటీ శాఖలలో డ్రైవర్లుగా పనిచేస్తున్న తమ సమస్యలు ప్రభుత్వానికి పట్టద. అరకులోయ జి సి సి.సొసైటీ బ్రాంచ్ నందు జి సి సి వాహనము నందు డ్రైవర్లుగా కరోనా కాలంలో-అన్ని ప్రాంతాలలో సేవలందించి రాత్రనక పగలనక ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని సేవలందించిన తమకు ప్రభుత్వం గుర్తించాలని బుధవారం జిసిసి డ్రైవర్ మధు. నూకరాజు లు తమా ఆవేదన వ్యక్తపరిచారు.

ప్రజలకు బడుగు బలహీన వర్గాలకు ఆకలి తీర్చే సొసైటీ నందు పనిచేస్తున్న మాకు చాలీచాలని జీతం భార్యాబిడ్డల బ్రతకటానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని ఆయన బుధవారం విలేకరులకు వాపోయారు ప్రభుత్వం గుర్తించి కరోనా కాలం లో పని చేసినటువంటి సమయంలో యమలీలలకు డ్రైవర్లకు రావాల్సిన టువంటి రాయితీని ప్రభుత్వం సహాయపడాలని ఆయన అన్నారు.

# ముసిడిపల్లిలో హెల్త్ క్లినిక్ సెంటర్ ప్రారంభం



దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : మండలంలోని ముషిడిపల్లి గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థలో భాగంగా వైఎస్ఆర్ క్లినిక్ (గ్రామీణ ఆరోగ్య కేంద్రం) నూతన భవనాన్ని ప్రభుత్వ విప్, మాడుగుల శాసనసభ్యులు బూడి ముత్యాల నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఈ రాష్ట్రంలో అన్ని విధాలా అభివృద్ధి, సంక్షేమం పార్టీలకతీతంగా అమలు చేసి శరవేగంగా పరుగులు పెట్టిస్తున్నారు. రాష్ట్ర ప్రజలందరికీ మంచి సువర్ణ పరిపాలన అందిస్తూ భారత దేశంలోనే అత్యంత కొత్త ముఖ్యమంత్రిగా చరిత్రకెక్కారు అన్నారు.

# టీడీపీ మండల అధ్యక్షుడికి అభినందనలు



మాకవరపాలెం (విజయభాను న్యూస్) : మాకవరపాలెం మండల టీడీపీ అధ్యక్షులుగా ఎన్నికైన రాచపల్లి ఎంపిటిసి రుత్తల యర్రా పాత్రుడుకి తామరం టీడీపీ కార్యకర్తలు అభినందించారు. మండల టీడీపీ అధ్యక్షుడిగా యర్రాపాత్రుడిని మంగళవారం మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో...

తామరం టీడీపీ నేత కోసూరు శ్రీను ఆధ్వ ర్యంలో గ్రామ టీడీపీ కార్యకర్తలు, నాయ కులు యర్రాపాత్రుడిని మర్యాద పూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలిపారు.

## వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘ అధ్యక్షులు కొణతాల శ్రీనివాస్ పర్యవేక్షణలో

# నియోజకవర్గ కార్యవర్గ కమిటీ వార్డు అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేత



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ వెనుక బడిన కులాల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర అధ్య క్షులు కొణతాల శ్రీనివాస్ పర్య వేక్షణలో విశాఖ దక్షిణ నియోజకవర్గ అధ్యక్షులు కండి పిల్లి నర్సింగ్ రావు అధ్యక్షతన బుధవారం సంఘం కార్యాలయంలో తొలి విడతగా విశాఖ దక్షిణ నియోజకవర్గం సంబం ధించి నియోజకవర్గ కార్య వర్గ కమిటీ అలాగే వివిధ వార్డు అధ్యక్షులు నియమిస్తూ వారందరికీ నియామక పత్రాలను అందజేయడం జరిగింది ఈ కార్యక్రమానికి అతిథులుగా వైసిపి యువ నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ సంఘం ఉపాధ్యక్షులు 35 వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ప్రముఖ బీసీ నాయకులు ఎం జగదీశ్వర్ గారు బిజెపి నాయకులు కె.కుమార్ పాల్గొని నియామక పత్రాలను అందజేశారు దక్షిణ నియోజవర్గం కార్యదర్శిగా కోటా కాత్యాయని సహాయ కార్యదర్శి గా వై రవణమ్మ గారు కోశాధికారిగా కే రమణ గారు గౌరవ అధ్యక్షులుగా బీ లక్ష్మి గారు 41 వ వార్డు అధ్యక్షులు గా డి రాందేవ్ గారు 37 వ వార్డు అధ్యక్షులు గా సూరిబాబు గారు 35 వ వార్డు అధ్యక్షులు గా బి గోవింద్ గారు 36 వార్డ్ అధ్యక్షులు గా ఈ లక్ష్మి గార్లను నియమిస్తూ నియామక పత్రాలను అందజేయడం జరిగింది అలాగే సంఘములో చేరిన ప్రతి సభ్యుడికి ఉచిత ఇన్సూరెన్స్ బాండ్లను కూడా అందజేయడం జరిగింది ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కొణతాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈరోజు దక్షిణ నియోజకవర్గం లో తొలివిడతగా కొంతమందికి కార్యవర్గంలో స్థానం కల్పించడం జరిగిందని అలాగే దక్షిణ నియోజకవర్గంలో కొన్ని వార్డులకు వార్డు అధ్యక్షులను నియమించామని మా యొక్క సంఘాన్ని రాష్ట్రం మొత్తాన్ని మూడు జోన్లుగా విభజించి సంఘం అభివృద్ధి కొరకు కృషి చేస్తున్నామని అని తెలియజేశారు ద్రోణంరాజు శ్రీ వత్స వ్ మాట్లాడుతూ ఈ యొక్క సంఘం లో చేరిన ప్రతి సభ్యునికి ఉచిత ఇన్సూరెన్స్ ఇవ్వటమే కాకుండా మెడికల్ క్యాంపు అనేవి నిర్వహించడం ఎంతో మంచి శుభ పరిణామమని ఈ సంఘానికి నాయొక్క సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలియజేశారు.

ఈ సందర్భంగా విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ మా యొక్క సంఘం అందరి సహాయ సహకారాలతో దినదిన అభివృద్ధి చెందుతుందని త్వరలోనే మేము ఉత్తరాంధ్ర మొత్తం ముఖ్యంగా గ్రామాలలో ఉచిత మెడికల్ క్యాంపులను నిర్వహించే ఆలోచనలో ఉన్నామని అలాగే జీవీఎంసీ పరంగా సంఘానికి అవసరం వచ్చినా నేను ముందుంటాను తెలియజేశారు

ఈ కార్యక్రమంలో సంఘం అదనపు ప్రధాన కార్యదర్శి కోటా రమేష్ గారు సలహాదారు సిహెచ్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి పిల్ల అప్పారావు, పి సత్య నారాయణ చారి, బి త్రినాధ్, రవణమ్మ, కె రాములు, డి రాందేవ్ కే కాత్యాయని, శివ, హరీష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు

# ఆత్మ నిర్భర్ భారత్ అవగాహన కార్యక్రమం




అన్నవరం (విజయభాను న్యూస్) : నెహ్రూ యువ కేంద్ర కాకినాడ వారి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం కారోన కాలం లో ప్రవేశ పెట్టిన ఆత్మ నిర్భర్ భారత్ పథకం ను వివరిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది . గ్రామ స్థాయిలో యువతకు అవగాహన కల్పించేం దుకు ఈ తద్వారా యువత స్వశక్తి మీద నిలబడే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా నెహ్రూ యువ కేంద్ర శంకవరం బ్లాక్ సభ్యుడు ఎస్. సాయి బాబు మాట్లాడుతూ...

కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను అందరూ సద్వినియోగ చేసుకోవాలని గ్రామాల్లో యువతను ఆకట్టు కునేలా యువత ఏ విధంగా ముందుకు నడుచుకోవాలి అనేది తెలియచేశారు.

# ఈ నెల 17న సాయిబాబా వార్షికోత్సవం ఏర్పాట్లు

కొయ్యూరు (విజయభాను న్యూస్) : కొయ్యూరు మండలం సింగవరం గ్రామంలో ఈ నెల 17న శ్రీషిరిడీ సాయిబాబా 17వ వార్షికోత్సవంకు ఆలయ కమిటి ఘనంగా ఏర్పాట్లు చేశారు. 17తేది ఉదయం 5.15నిమిషాలకు ప్రభాతసేవ, 6. 15ని, చంద నాభిషేకం, పాలాభిషేకం, విభూది అభిషేకం, 7. 30ని, అష్టోత్తర పూజా కార్యక్రమాలతో పాటు 9.30ని, గణపతి హెూమం, సాయిగాయిత్రి హెూమం, పూర్ణాహుతి, 12గంటలకు మధ్యాహ్న హారతి కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ వివరించారు. కొయ్యూరుకి చెందిన గంగిశెట్టి. నరసింహమూర్తి, రామారావు, దంప తులు ఆద్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహిస్తున్నామని, భక్తులు తరలిరావాలని వారు కోరారు.

# టీడీపీ కి యువతే ప్రధానపాత్ర పోషించాలి

## భీమిలి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవానికి యువతే ప్రధానపాత్ర పోషించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, భీమిలి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యా లయంలో నారా లోకేష్ యువజన ఫౌండేషన్ అధ్యక్షులు తుపాకుల సంతోష్ రాజ్ 36వ జన్మదిన వేడుకలు గంటా నూకరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూలమాలలతో సత్కరించి సంతోష్ రాజ్ చేత కేక్ కట్ చేయించి నాయకులు, కార్యకర్తలకు మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం గంటా నూకరాజు మాట్లా డుతూ తుపాకుల సంతోష్ రాజ్ సహృద్భావి అని, ప్రజలతో మమేకమై నిత్యం ప్రజా సమ స్యల పరిష్కారం తపిస్తారని అన్నారు. భీమిలి నియోజకవర్గం నారా లోకేష్ యువజన ఫౌండేషన్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన దగ్గర నుండి ఇంకా బాధ్యతగా పనిచేస్తూ, పార్టీ పటిష్ఠకు విశేష కృషి చేస్తున్నారని అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో యువతే ప్రధానపాత్ర పోషించాలని అన్నారు. తుపాకుల సంతోష్ రాజ్ ఇంకా ఉన్నతమైన పదవులు పొంది అంచెలంచెలుగా ఎదగాలని, ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపు కోవాలని గంటా నూకరాజు ఆకాంక్షించారు. అనంతరం భీమిలి మండల పరిషత్ కార్యా లయంలో ఉన్న భవిత పాఠశాల దివ్యాంగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్య క్రమంలో 1వ వార్డు అధ్య క్షులు తమ్మిన సూరి బాబు, నాయకులు కాస రపు నాగరాజు, పెంట పల్లి యోగీశ్వరావు, కన కల అప్పలనాయుడు, పాసి త్రినాద్ కుమార్,, సంకురుబుక్త జోగారావు, అప్పికొండ నూకరాజు, వాసుపల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# సాకేత్ పుట్టినరోజు సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిరాశ్రయుల వసతి గృహంలో భోజనాలు పంపిణీ



అక్కయ్యపాలెం (విజయ భాను న్యూస్) : సాకేత్ పుట్టినరోజు సందర్భంగా పెద వాల్తేరు 17వ వార్డు, దలయ్ వారి వీధిలో గల ఇండి యన్ రెడ్ క్రాస్ సొసైటీ పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో భోజనాలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్.ఆర్.పేట సి.ఐ. సోమశేఖర్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి సేవలని అభినం దించారు. ఈ కార్యక్రమంలో అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్, వై.ఎస్.ఆర్. పార్టీ 10వ వార్డు ప్రచార కమిటీ అధ్యక్షులు కె.కన్నబాబు, మహిళ పోలీస్ మాధురి, సంస్థ ప్రతినిధి మురళి, కేర్ టేకర్ సాగర్ పాల్గొన్నారు.

# పరవాడ నూతన అర్ఐగా పి.శ్రీలేఖ



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండల నూతన రెవిన్యూ ఇన్స్ పైక్టర్ గా పి. శ్రీలేఖ పదవిబాద్యతలు స్వీకరించారు. ఈమె గతంలో అనకాపల్లి అర్ డిఒ కార్యా లయంలో, కలెక్టరేట్ లో విధులు నిర్వర్తించేవారు. ఇటీ వలే గాజువాక తహశీల్దార్ కార్యా లయంలో సినియర్ అసిస్టెంట్ గా బాద్యతలు నిర్వర్తించి పరవాడ మండల రెవిన్యూ ఇన్స్ పైక్టర్ గా పదోన్నతపై వచ్చారు. అనంతరము అమె విజయభాను ప్రతినిధితో మాట్లడుతూ ప్రభుత్వ అస్తులును అక్రమణచేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు అన్నారు. ప్రభుత్వ స్దలాల పరిరక్షణకు కృషిచేస్తామనీ ఈ సందర్భంగా అమె తెలిపారు.

## త్రిపురాంతకస్వామి వారికి

# వైభవంగా అవభృథ స్నానం





సింహాచలం (విజయభాను న్యూస్) : శ్రీ వరాహలక్ష్మి నృసింహ స్వామి వారి దేవస్థానం లో ఉప దేవాలయం అయినటువంటి శ్రీ త్రిపుర సుందరీ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి వారి దేవాలయంలో దివ్య తిరుకళ్యాణ మహెూత్సవములలో భాగంగా పౌర్ణమి దినాన్ని పురస్కరించుకొని త్రిపుర సుందరీ సమేత త్రిపురాంతకేశ్వర స్వామివారిని గంగాధర వద్దకు తోడ్కొని వెళ్లి అవభృథ స్నానం అత్యంత వైభవోపేతంగా జరిపించారు.

# శిధిల రోడ్లను బాగు చేయాలి



కొయ్యూరు (విజయ భాను న్యూస్) : శిధిలా వస్థకు చేరిన రహదారిని బాగుచేయాలని బిజెపి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ అర్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. కొమ్మిక పంచాయతీ బర్రంపేట మీదుగా కొయ్యూరు మండల కేంద్రానికి శిధిల మైన రహదారి గుండా కొమ్మిక, కంఠారం, బాలా రం, బకులూరు, ఆడా కుల, ఆర్ కొత్తూరు, ఆరు పంచాయితీల గ్రామ ప్రజలు ప్రయాణం చేస్తారని, అదే విధంగా కొయ్యూరు మండల ప్రభుత్వ అధికారులు, మరీ ముఖ్యంగా పోలీసు అధికారులు ఏ సమస్య వచ్చినా ఇదే మార్గం గుండా ఈ ఆరు గ్రామ పంచాయితీలకు వెళ్తంటారన్నారు. రహదారి పూర్తిగా శిధిలావస్థకు చేరుకుందని, ఈ కారణంగా ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ద్విచక్ర వాహనాలు అయితే పడిపోవడం జరుగుతుందన్నారు. కావున సంబంధిత అధికారులు, కొయ్యూరు మండల స్థానిక నాయకులు స్పందించి ఈ మార్గాన్ని బాగుచేయాలని కోరారు.

## వనదుర్గమ్మవారి ఆలయంలో

# ఘనంగా ప్రత్యంగిరా హెూమం



అన్నవరం (విజయభాను న్యూస్) : తూర్పుగోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో పౌర్ణమి పర్వదినం సందర్భంగా క్షేత్ర రక్షకురాలైన వనదుర్గమ్మవారి ఆలయంలో బుధవారం ఘనంగా ప్రత్యంగిరా హెూమం నిర్వహించారు.దుష్ట శక్తులను రక్షించేది,శత్రువుల భాధల నుండి రక్షణ కొరకు సకల కార్యముల యందు విజయం చేకూర్చడానికి నిర్వహించే ప్రత్యంగిరా దేవతా హెూమాన్ని లోక శ్రేయస్సు కొరకు, సర్వజన హితం కొరకు దేవస్థానం వారు ఘనంగా ప్రత్యంగిరా హెూమం నిర్వహించారు.ముందుగా విఘ్నేశ్వరుని పూజ చేసి ప్రత్యంగిరా దేవతా వేద మంత్రాలను పారా యణము చేస్తూ హెూమాన్ని చేసారు. అనంతరం వేద మంత్రోఛ్ఛారణలు, మంగళ వాయిద్యాలు నడుమ సుగంధ భరిత ద్రవ్యాలను షోడశోప చార పూజలు చేసి మహా పూర్ణహుతి సమర్పిం చారు. పూజా కార్యక్రమాలు బ్రహ్మశ్రీ నాగాభట్ల. కామ్వేవర శర్మ, అర్చకులు చల్లపల్లి.ప్రసాద్ శర్మ,కూచిభట్ల.ప్రసాద్,చిట్టెం నగేష్,చిట్టెం.వాసు మరియు వేద పండితులు, వైదిక బృందం ఆద్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, భక్తులు, గ్రామస్థులు కోవిడ్ నిబంధ నలు పాటిస్తూ పాల్గొన్నారు.

# చెరువులను అభివృద్ధి చేయడం అభినందనీయం



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : చెరువులను అభివృద్ధి చేయడం అభినందనీయమని మాజీ డీసీసీబి చైర్మన్ సుకుమార వర్మ అన్నారు. బుధవారం మండలంలో రామన్నపాలెం గ్రామంలో ఏషియన్ పెయింట్స్ సహాకారంతో అభివృద్ధి చేయునున్న చెరువును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోనా సంధ్య బుజ్జి ,ఏషియన్ పెయింట్స్ హెచ్ ఆర్ శివ ప్రసాద్, ఎంపిటీసీ లాలం శ్రీను, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కు అంతరాయం - పరవాడ అర్ ఇసియస్ సెక్షన్ ఎఇ శేషసాయి



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలంలో గల పలుప్రాంతాల్లో నేడు విద్యుత్ కు అంతరాయం ఏర్పడుతుంది అని జెఎన్ పిసి పార్మ డి3ఎఇ మరియు పరవాడ అర్ ఇసియస్ ఎఇ శేష సాయి తెలిపారు. ఈయన బుధవారం విజయభాను ప్రతినిధితో మాట్ల డుతూ నేడు ఊటగెడ్డ జంక్షన్ నుండి పోలిరెడ్డివానిపాలెం సబ్ స్టేషన్ వరకు 33కెవి విద్యుత్ పోల్స్ వెయుట కోరకు. కావున వినియెగ దారులు అందరూ గమనించ వల్సినదిగా అయన కోరారు.

# దైవ కార్యాన్ని రాజకీయం చేయడం దురదృష్టకరం



గాజువాక(విజయభాను న్యూస్) : ఒక దైవకార్యాన్ని కూడా రాజకీయం చేయడం చాలా దురదృష్టకరమని వైసీపీ మహిళా నాయకురాలు మంత్రి మంజుల ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ 65 వ వార్డు వాంబే కోలనిలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఆమె మాట్లాడుతూ పరిసర ప్రాంత ప్రజలకు అనువుగా కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేస్తుంటే ఆలయ నిర్మాణం చూసి జీర్ణించకోలేని స్థానిక పచ్చ పార్టీ నేతలు ఆలయ నిర్మాణానికి అడ్డు తగులు తున్నారని మండిపడ్డారు.

ఆలయ నిర్మాణంలో అవకతవకలు జరిగాయాని అలాగే ఆలయ పరిసర ప్రాంతంలో ఉన్న స్థలాలు కబ్జా చేస్తున్నామంటూ తమపై తప్పుడు ప్రచారాలు చేయడం వారి నీచ రాజకీయానికి నిదర్శనం అన్నారు. నిజంగా ఆలయ పరిసర ప్రాంతంలో తాను ఒక గజం భూమైనా కబ్జా చేశానని పచ్చ నాయ కులు, స్థానిక పచ్చ నేతలు నిరూపించగలరా అని ప్రశ్నించారు. అసలు కబ్జాలకె కేరాఫ్ అడ్రస్ పచ్చ నేతలు గాజువాక జి.వి.ఎం.సి. పరిది 66వ వార్డు బి.సి. రోడ్ ప్రభుత్వ గెడ్డ స్థలమును ఆక్రమించి (సర్వే నెం.: 67) వాణిజ్య షాపులు నిర్మించి షాపులు అద్దికి ఇవ్వడం అలాగే అదే వార్డులో కణితి రోడ్ ప్రభుత్వ భూమిని ఆక్రమించి వాణిజ్య షాపులు నిర్మించి షాపులు అద్దికి ఇచ్చి ప్రభుత్వ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి తమ గల్లా పెట్టెలు నింపుకోవడం అంతటితో ఆగకుండా 67వ వార్డు కొత్త గాజువాక ఎలిమెంట్రి స్కూల్ సర్వేనెం : 87 ప్రభుత్వ స్కూల్ స్థలమును కూడా ఆక్రమించి షెడ్లు నిర్మించి అద్దికి ఇచ్చి ప్రభుత్వాన్ని మోసం చేసిన వ్యక్తి మాజీ కౌన్సిలర్, ప్రస్తుత టిడిపి గాజువాక సమన్వాయ కర్తగా చలామణి అవుతున్న ప్రసాదుల శ్రీనివాసరావు అని ఆరోపించారు. ఇక స్థానిక నాయకులు విషయానికొస్తే పెదగంట్యాడ మండలం సర్వేనెంబర్ 274లో 2004లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాల వారికి సొంతింటి కళ నెరవేరే చేందుకు 27 బ్లాక్ లతో 674 వాంబే గృహాలను నిర్మిస్తే అందులో సుమారు రెండు వందల గృహాలకు పైగా బినామీల పేర్లతో స్థానిక పచ్చ పార్టీ కి రెట్టి వాసు, జయమ్మలు పక్కదోవ పట్టించి ఇళ్లను వేరే వారికి అమ్ముకొని సొమ్ము చేసుకున్న ఘనత స్థానిక పచ్చ నేతలుగా చలామణి అవుతున్నదెవరో అందరికి తెలుసునని మంజుల అన్నారు. స్థానికంగా ఏ ఒక్కరైనా ఇళ్లు నిర్మించుకున్న వాళ్లకు మామూలు ఇవ్వాలని లేకపోతే జీవీఎంసీ సిబ్బందికి కానీ రెవిన్యూ సిబ్బంది కానీ ఫిర్యాదు చేసి తొలగించడం వారి నైజమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మంత్రి మంజుల, పెంటకోట పైడిరాజు, వైఎస్ఆర్ సిపి రాష్ట్ర మహిళ సెక్రటరీ కంచర్ల శ్రీదేవి, పప్పుల పుష్ప, స్వాతి, కనక, సత్యవతి, పద్మ, భవాని, చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.



తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనార్థం విచ్చేసిన హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ కి తిరుమల శ్రీవారి ఆలయం వద్ద స్వాగతం పలికి, స్వామివారి దర్శనానంతరం తీర్థప్రసాదాలను అందించిన టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి. చిత్రంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, టీటీడీ అధికారులు ఉన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయండి

## టీడీపీ నాయకుడు అబ్రహం పిలుపు..



పాడేరు(విజయభాను న్యూస్) : టిడిపి పార్టీ బలోపేతానికి కృషి చేయా లని పార్టీ నాయకులు మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు అబ్రహం పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమానికి పెదబయలు తెలుగు దేశం పార్టీ ప్రెసిడెంట్ శ్రీమతి సికరి,సుకుమారి అధ్యక్షత వహించారు, ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చెయ్యాలని 2024 ఎలక్షన్ కి మనము ఎమ్మెల్యే గెలిపించు కొని చంద్రబాబు నాయుడు గారికి గిఫ్ట్ ఇవ్వాలన్నదే తమ ధ్యేయమని చెప్పారు, మంగళవారం పెదబయలు టిడిపి మండల బాడీ సమావేశం నిర్వహించారు. అరకు నియోజకవర్గ ఇన్చార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మేరకు మండల బాడీ సమావేశాన్ని మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు అబ్రహం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని రానున్న కాలంలో వైసిపి ప్రభుత్వ వైఖరిని పరిపాలన విధానాన్ని ఎండగడుతూ వైసిపి ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. ఇప్పటికే వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు గిరిజనులు గుర్తిస్తున్నారని తెలిపారు. నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పార్టీ బలోపేతానికి పనిచేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎం పి టి సి లు ప్రెసిడెంట్ లు టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు




తిరుమలలోని శ్రీ ఆంజనేయస్వామి వారి జన్మభూమి అభివృద్ధి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ శ్రీ శారద పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానంద సరస్వతి స్వామి వారు, శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి వారు, పద్మవిభూషణ్ శ్రీ తులసీ పీఠ్ సేవా న్యాస్ జగద్గురు శ్రీశ్రీశ్రీ రామభద్రాచార్య మహరాజ్ వారు, అయోధ్య రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ కోశాధికారి, విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ జాయింట్ జనరల్ సెక్రటరీ కప్పగంతుల కోటేశ్వర శర్మ, టీటీడీ అధికారులు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి.

# నిరసన దీక్ష విరమించిన గవిరెడ్డి



దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : అభివృద్ధి చేతగాని వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని చోడవరం మాజీ ఎమ్మెల్యే కే ఎస్ ఎం రాజు అన్నారు.మాజీ ఎమ్మెల్యే, టిడిపి రూరల్ జిల్లా మాజీ అధ్యక్షులు గవిరెడ్డి రామానాయుడు మండలం లోని కలిగొట్ల- వేచలం వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్ష బుధవారంతో ముగిసింది. రామానాయుడుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఆయన మాడుగుల నియోజకవర్గంలోని టీడీపీ నాయకులతో నిరసన దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే.దేవరాపల్లి మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు చిటిమి రెడ్డి సూర్యనారాయణ, శారఖాన సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తీవ్రంగా ఖండించారు. మాడుగుల నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయంలో జరిగిన పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు గునూరు మల్లునాయుడు, చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, టిడిపి ముఖ్య నాయకులు పోతల రమణమ్మ, రొంగలి మహేష్,పోతల చిన్నంనాయుడు,బండారు రామారావు, బి.తాతారావు, ఆదిరెడ్డి వరలక్ష్మి, చిటిమిరెడ్డి సత్య వేణి, సోమిరెడ్డి గోవింద, చల్లా నానాజీ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ అరెస్టులు చేయవద్దు

## పాడేరు ఏఎస్పి కు మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్



పాడేరు : (విజయభాను న్యూస్ ): విశాఖ ఏజెన్సీ అరకు నియోజక వర్గ దివంగత ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కిడారి సర్వేశ్వరరావు,మాజీ ఎమ్మెల్యే సివేరి సోమలను సెప్టెంబర్ 23 2018వ సంలో నక్సల్స్ దాడిలో మరణించిన సంగతి తెలిసిందే! సర్వేశ్వర రావు, సోమలు మరణించడంతో కట్టలు తెంచుకుని అభిమానులు పోలీసుల వైఫల్యం వల్లే హత్యలు జరిగాయని ఆగ్రహించిన అభిమానులు అరకు పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్ళి పోలీసులను నిలదీస్తున్నా తరుణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీస్ స్టేషన్ లో ఉన్న వాహనాలు ధ్వంసం చేశారు. దినిపై పోలీసులు కొంత మందిని గతంలో అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. అయితే అదే విషయమై మరి కొంత మందిని అదుపులో తీసుకున్నారని పాడేరు ఏఎస్పి ఆఫీసుకు తీసుకు వచ్చరని తెలియగానే మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ఏఎస్పి కార్యాలయానికి చేరుకుని పాడేరు ఏఎస్పి తో మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ అమాయక గిరిజనులను కేసుల పేరుతో భయభ్రాంతులకు గురి చేయవద్దని సంబంధం లేని వాళ్ళని పోలీస్ స్టేషన్ కి పిలిచి ఇబ్బందులకు గురి చేయటం వల్ల కలిసొచ్చింది ఏమి లేదని అన్నారు.అన్యాయంగా ఎవరిని అరెస్టులు చేయవద్దని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ఏఎస్పీ కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కిడారి వెంట బాకురు సర్పంచ్ బాకురు వెంకటరమణ రాజు, దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, అండిభ సర్పంచ్ తామర్ల సత్యనారాయన, అరకు అసెంబ్లీ టిడిపి కో కన్వీనర్ ఉబ్బెటీ శివ సాగర్, టీడిపి నాయకులు తాంగుల మహేష్,మురళి, తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల చెంతకు చేరిన తప్పిపోయిన బాలుడు



దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : గత కొన్ని రోజులుగా తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి దేవరాపల్లిలో సంచరిస్తున్న బాలుడు ను స్థానిక సచివాలయ ఉద్యోగులు గుర్తించారు. ఈ బాలుడి ఫోటోను వాట్సాప్ లో షేర్ చేయడం తో తల్లిదండ్రులు బంధువులు గుర్తించి బుధవారం దేవరాపల్లి సచివాలయానికి చేరుకున్నారు. అరకు వేలి మండలం పాత బల్లిగూడ గ్రామానికి చెందిన ఈ బాలుడు మతిస్థిమితం లేక దేవరపల్లిలో సంచరిస్తూ కనిపించారు. ఈ బాలుడిని దేవరాపల్లి సచివాలయంలో తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తల్లిదండ్రులకు అప్పగించడం పట్ల స్థానికులు సచివాలయ సిబ్బందిని అభినందించారు.

## సీఎం జగన్‌ను కలిసిన టీమిండియా

# అండర్-19 వైస్ కెప్టెన్ షేక్ రషీద్




అమరావతి: తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని భారత క్రికెట్ అండర్-19 జట్టు వైస్ కెప్టెన్ షేక్ రషీద్ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా రషీద్‌ను సీఎం అభినందించారు. ప్రభుత్వం తరపున పలు ప్రోత్సాహకాలు, రూ. 10 లక్షల నగదు బహుమతి, గుంటూరులో నివాస స్థలం కేటాయింపు, ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరపున ప్రకటించిన రూ.10 లక్షల చెక్ సీఎం చేతుల మీదుగా అందజేశారు.

# రెండు తెలుగు రాష్ట్రాలకు శ్రీవారి అనుగ్రహం ఉండాలి

- మే, జూన్ నెలల్లో ధార్మిక సదస్సు నిర్వహించాలి
- శ్రీవారిని దర్శించుకున్న విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు



తిరుమల/తిరుపతి (విజయభాను న్యూస్ : విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామి వారు , శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి వారు బుధవారం తిరుమలలో శ్రీవారిని దర్శించారు. అంజనాద్రి అభివృద్ధి పనులకు టీటీడీ నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనేందుకు పీఠాధిపతులు తిరుమల వెళ్లారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామిని దర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి దర్శనం ఆనందాన్నిచ్చిందన్నారు రెండు తెలుగు రాష్ట్రాలకు వేంకటేశ్వర స్వామి అనుగ్రహం ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు. మే, జూన్ నెలల్లో ధార్మిక సదస్సు నిర్వహించాలని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు సూచించినట్లు తెలిపారు. కరోనా కారణంగా గత రెండేళ్లుగా టీటీడీ ఆధ్వర్యంలో ధార్మిక సదస్సు నిర్వహించలేదని అన్నారు

# స్పందన వర్క్ షాప్ కు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలి




విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : గురువారం నిర్వహించనున్నస్పందన వర్క్ షాప్ కు అంధికారులందరూ ఉదయం 8. 30 గంటలకే చేరుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో స్పందన వర్క్ షాప్ నిర్వహణ పై జిల్లా జాయింట్ ఎం. వేణుగోపాల్ రెడ్డి తో కలిసి ఆయన సమీక్షించారు. ఈ వర్క్ షాప్ స్థానిక వి ఎమ్ ఆర్ డి ఎ సమావేశ మందిరంలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉన్న తాధికారులు వచ్చి పలు సూచనలు చేయడం జరుగుతుందన్నారు.జిల్లా అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించిన సెక్రటరీలు, ఎంపిడిఓలు, తహసీల్దారులు, హాజరు కావాలన్నారు. స్పందన అర్జీలను ఏ విధంగా రిడ్రెస్ చేయాలి, తదితర అంశాలపై వివరించడం జరుగుతుందని తలపారు.. విఎంఆర్డిఎ హాలులో 6 కౌంటర్లు ఏర్పాటు చేయడమైనదని, అందరూ సమయానికి చేరుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అధికారులు ఉదయం 8.30 గంటలకే వర్క్ షాప్ హాలుకు హాజరై రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రాలకు సంబంధించి ట్రాన్సిట్ అకామిడేషన్ కోసం ప్రతిపాదనలు అందరు జిల్లా అధికారులు త్వరితగతిన పంపాలని చెప్పారు. ప్రతి కార్యాలయం స్వంత భవనం ఉంటేవివరాలు తెలియ జేయాలని, లేనిచో ఎంత ఎకామిడేషన్ కావాలో తెలియ జేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ గురువారం ఉదయం 9.గంటలకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని, ఎవరికి కేటాయించిన సీట్లలో వారే



కూర్చోవాలన్నారు. సమావేశానికి అందరూ జిల్లా అధికారులు పాల్గొనాలని, వర్క్ షాప్ విజయవంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కులో ఉత్పత్తి రికార్డ్



గాజువాక :(విజయభాను న్యూస్ ): విశాఖ ఉక్కు కర్మాగారం లో 16 సంవత్సరాల క్రితం అనగా 10 ఫిబ్రవరి 2006 లో13325 టన్నుల ఉత్పత్తి చేశారని, అది నేడు అధిగమించి 15 ఫిబ్రవరి 2022 లో 15230 టన్నుల ఉత్పత్తి చేసిన ఉక్కు ఉద్యోగులను, కాంట్రాక్ట్ కార్మికులను గుర్తింపు యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె అయోధ్య రామ్, వై టి దాస్ అభినందించారు. బుధవారం జరిగిన ఒక కార్యక్రమం లో వారు మాట్లాడుతూ ఇది సుమారు రెండు వేల టన్నుల అధికంగా ఉత్పత్తి అయిందని. దీనికి కృషి చేసిన కార్మిక వర్గానికి ఇవ్వవలసిన ప్రోత్సాహకాలను ఇవ్వకుండా యాజమాన్యం వ్యవహరిస్తోందని వారు విమర్శించారు. అలాగే ఆస్ట్రేలియా నుంచి రావాల్సిన కోకింగ్ కోల్ సకాలంలో అందకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు యాజమాన్యం ఖరీదు చేయలేదని వారు వివరించారు. అలాగే బ్లాస్ట్ ఫర్నేస్-3 లో ఉత్పత్తి ప్రారంభించకుండా ప్రభుత్వం అడ్డుపడుతోందని వారు తీవ్రంగా విమర్శించారు. కనుక ఉత్పత్తి ఆధారంగా కార్మికులకు ప్రోత్సాహకాలను అందిస్తూ, బ్లాస్ట్ ఫర్నేస్-3 లో తక్షణం ఉత్పత్తి ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు.

# బుల్లి ఆవుకు అరుదైన గౌరవం

***కేంద్రం విడుదల చేసిన పుంగనూరు ఆవు బొమ్మతో కూడిన పోస్టల్ కవర్***

### పుంగనూరు జాతి ఆవు పేరుతో పోస్టల్ స్టాంప్

పుంగనూరు(చిత్తూరు జిల్లా): పుంగనూరు జాతి ఆవులను క్రీ.శ. 610 సంవత్సరంలో గుర్తించినట్లు శాసనాలు పేర్కొంటున్నాయి. బాణులు, నోళంబులు, వైదంబ చోళ ప్రభువులు పుంగనూరు ఆవును పోషించేవారు. పుంగనూరు నుంచి తిరుపతి వరకు గల అప్పటి అభయారణ్యంలో పుంగనూరు ఆవులు అభివృద్ధి చెందాయి.

**ఆవుల విశిష్టత**

భారతదేశంలో ఎక్కడా లేని విధంగా పుంగనూరు ఆవులు చిన్న అకారాన్ని కలిగి ఉంటాయి. మంచి ఔషధ గుణాలు, స్నేహపూర్వకంగా మెలుగుతాయి. ప్రపంచ దేశాల్లో ఈ ఆవు పాలకు మంచి గిరాకీ ఉంది. తెలుపు, నలుపు వర్ణాలతో ఉంటాయి. ఈ ఆవు పాలలో ఉన్న ఔషధ గుణాలు మరే పాలలోనూ



లేదని బయోడైవర్సిటీ యూనివర్సిటీ ప్రకటించింది. ఈ ఆవుల చరిత్ర, విశిష్టత గురించి మద్రాస్ ప్రభుత్వం అప్పట్లో గెజిట్‌ను విడుదల చేసింది. అలాగే కేఎస్ఎస్ శేషన్ అనే రచయిత తన పరిశోధనాత్మక పుస్తకం బ్రిటీష్ రోల్ ఇన్ రూరల్ ఎకానమీలో పుంగనూరు ప్రాంత ఆవుల గురించి జమీందారులు చేపట్టిన సంరక్షణ చర్యలను విశదీకరించారు.

# స్వప్రయోజనాల కోసమే ఏయూపై అసత్య ప్రచారం

- ఏయూపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలి - కేవలం నలుగురు వ్యక్తులు స్వప్రయోజనాలకోసం ఇదంతా చేస్తున్నారు

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఆంధ్ర విశ్వవిద్యాలయంపై కొంతమంది స్వప్రయోజనాలకోసం తరచూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని వీరి మాటలను ప్రజలు విశ్వసించ వద్దని ఏయూ సీడీసీ డీన్ ఆచార్య ఎన్.సత్యనారాయణ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఏయూ హిందీ విభాగం సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన పౌర గ్రంథాలయంలో కొంతమంది రౌండ్ టేబుల్ నిర్వహిస్తామని ప్రకటించారన్నారు. ఏయూతో సంబంధం లేని వ్యక్తులు ఏయూ గురించి ఏమిటి సంబంధం అని ప్రశ్నించారు. విశ్వవిద్యాలయంలో ఉద్యోగాలు. ప్రాజెక్ట్ ఫెలోలుగా, బ్లాక్ మైల్ రాజకీయాల ద్వారా దక్కించుకోవాలని ఆలోచిస్తున్న నలుగురు వ్యక్తులు దీనికి కారణమన్నారు. విశ్వవిద్యాలయాన్ని తామంతా నమ్ముకుని బతుకుతున్నామని, 18-2-2022వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశం అంటున్న వారంతా ఏయూను అమ్ముకోవాలని భావిస్తున్నవారేనన్నారు. విశ్వవిద్యాలయంలో తమ ఆటలు సాగడం లేదని భావించిన వీరందరూ తమకు ఇష్టం వచ్చినట్లు పత్రికల్లో వార్తలు ప్రచురించడం, విశ్వవిద్యాలయ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించడం, వ్యాఖ్యలు చేయడం జరుగుతోందన్నారు. వీరందరికీ తగిన గుణపాఠం చెబుతామన్నారు. విశ్వవిద్యాలయంలో త్వరలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఆచార్యులంతా కలసి మెగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, వర్సిటీ అభివృద్ధి నిరోధకంగా పనిచేస్తున్న వ్యక్తులపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమీషనర్‌కు, రాష్ట్ర గవర్నర్‌కు, హెమంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు. విశ్వవిద్యాలయంలో దళిత, గిరిజన, బీసీ ఆచార్యులకు, ఉద్యోగులకు సమన్యాయం కల్పిస్తూ ప్రోత్సహిస్తున్న పరిపాలన ఉందన్నారు.

ఉంద్యోగులంతా పాలకులపై పూర్తి సంతృప్తితో పనిచేస్తున్నారన్నారు. విశ్వవిద్యాలయం ఎంతో అభివృద్ధి చేస్తూ, పాలనలో అట్టడుగు వర్గాలకు సైతం ప్రాతినిధ్యం, ప్రాధాన్యత




కల్పిస్తున్న నాయకత్వం నేడు ఏయూలో ఉందన్నారు.

ఏయూ విద్యావిభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు మాట్లాడుతూ తల్లివంటి విశ్వవిద్యాలయానికి అపకీర్తి కలిగిస్తూ, వర్సిటీ ప్రగతికి అడ్డుపడుతున్న వ్యక్తులను తాము ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామిక విధానాలను సంపూర్ణంగా అమలు చేస్తూ, అధికశాతం పదవులు దళిత, గిరిజన, మైనారిటీలకు అందిస్తున్న ఏయూ పాలకులపై దుష్టచారం చేయడం సరికాదన్నారు. కొన్ని రాజకీయ పార్టీలతో లాలూచిపడి కొంతమంది వ్యక్తులు ఇదంతా చేస్తున్నారన్నారు. నిజమైన సమస్యలు ఉంటే పరిష్కరించడానికి తామంతా సిద్ధంగా ఉ న్నామన్నారు. విశ్వవిద్యాలయ ప్రశాంతతకు భంగం కలిగించే వారిపై క్రమశిక్షణ చర్యలకు చట్టపరంగా పోరాటానికి సైతం సిద్ధమన్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో విశాఖ నగరంలో అశాంతిని సృష్టించే ఉద్దేశంతో ఈ నలుగురు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నారనే సందేహం కలుగుతోందన్నారు. ఏయూకు ఒక్కటే పూర్వ విద్యార్థుల సంఘం ఉందని, ఏయూ లోగో, పేరు ఉపయోగిస్తూ ఇష్టారాజ్యంగా సమావేశాలు నిర్వహించడం, ప్రకటలు నివ్వడం సరికాదన్నారు. దీనిపై చట్టపరంగా కేసు వేస్తామని స్పష్టం చేశారు. హెల్జడిసి సంచాలకులు ఆచార్య ఎన్.ఏ.డి పాల్ మాట్లాడుతూ ఏయూలో గతంలో ఎన్నడూ లేనంత ప్రగతి సాధిస్తోందన్నారు. చెయిర్ ప్రొఫెసర్ల ఏర్పాటు, రీసెర్చ్ సెంటర్ల ఏర్పాటు జరుగుతూ దేశంలో అత్యుత్తమ పది విశ్వవిద్యాలయాలలో ఒకటిగా నిలపే దిశగా పాలకులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు.

ఇటువంటి తరుణంలో నగరంలోను, ఏయూలోను అశాంతిని సృష్టించాలని కొంత మంది వ్యక్తులు పనిచేయడం దురదృష్టకరమన్నారు. ఇటువంటి వ్యక్తుల వ్యాఖ్యలను నగర ప్రజలు విశ్వసించరన్నారు.

వర్సిటీ నుంచి లబ్ది పొందిన వ్యక్తులు ఇటువంటి కార్యక్రమాలను చేపట్టడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా వీరంతా తమ చర్యలను మానుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో వీరికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో సోషల్ ఎక్స్ క్లూజన్, ఇంక్లూజివల్ స్టడీస్ సెంటర్ సంచాలకులు డాక్టర్ పి.సుబ్బారావు ప్రసంగించగా డాక్టర్ శాంతారాం, డాక్టర్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com